

# అన్నపూర్ణ

కె. రామలక్ష్మి

రోడ్డుమీద ట్రాఫిక్ తక్కువగావుంది. అన్నపూర్ణ బుల్లికారు చాలా స్పీడుగా వస్తూంది. చూసిన సినిమా బాగున్న ఉత్సాహంలో అన్నపూర్ణపాదం ఏక్సిలేటరుని అదుక్కి తొక్కేస్తూంది. కాని సడెన్‌గా బుల్లికారు దగ్గడం ప్రారంభించింది : రెండుసార్లుదగ్గి మళ్లీ మామూలుగా నడుస్తూంటే ఓ క్షణంపాటు అదిరిపడ్డ అన్నపూర్ణ తృప్తిగా నవ్వుకుని మళ్ళీ సీటులో జేరబడి కూర్చొంది. ఫాక్టరీలకి దూరంగానూ బస్సులకీ రొదకీ దూరంగానూ ఉండాలని అన్నపూర్ణతండ్రి పెరుమాళ్ళుగారు పట్నంలో ఉన్నట్టూ లేనట్టూగా కట్టించారు బంగళా. 'కారుందిగా దూరమైనా దగ్గిరైనా ఒకటే' అని ఆయన నమ్మకం. కాని అన్నపూర్ణకి అలా అనిపించదు. సినిమాకెళ్ళాలంటే అరగంటముందు బయలుదేరాలి. స్నేహితురాళ్ళనెవరినేనా రమ్మంటే 'అయ్యో బాబోయ్ తిరిగి వచ్చేప్పుడు కష్టమే' అంటారు. 'పట్నం అంచునకంటే పట్నం నడి బొడ్డునవుంటే బాగుండును కొంప'. అనిపిస్తుంది అన్నపూర్ణకి.

రోడ్డు చాలా ప్రశాంతంగావుంది. కొత్తగా లేచిన బంగళాలూ ప్లాట్లూ అక్కడక్కడ కనిపిస్తున్నాయి. వాట్లలో లైట్లుకూడా అందంగా కనిపిస్తున్నాయి. రోడ్డు కిటూ-ఇటూ వున్న ట్యూబులైట్లే ఆ లేత చీకట్లలో ఒకటీ అరా ఆరి ఆరి వెలుగుతున్నాయి.

ఉన్నట్టుండి అన్నపూర్ణ బుల్లికారు ఆగిపోయింది. గేర్లు మార్చింది. క్లచ్చి తెగ కదిలించి చూసింది. చలనంలేదు. అన్నపూర్ణ ఉస్సురంటూ కారుదిగింది. బోనెట్ ఎత్తి వైర్లూ అవీ చూడ్డం మొదలెట్టింది. కాని ఆమెకేం అర్థం కావడం లేదు.

పక్కనుంచే దూసుకు పోయిందొక జీపు. కారుదాటి ఓ ఇరవైగజాలు వెళ్లిపోయింది కాస్తా. అంత స్పీడులోనూ వెనక్కివచ్చి కారుపక్క ఆగింది. 'కెనై హెల్ప్ యూ ?' అని అడిగాడా జీపుతోలే రాజు.

"నో థ్యాంక్స్. అదే కదులుతుంది" అంది బోనెట్‌లోంచి తలతీయకుండానే.

కాని రాజు జీపు స్టార్టుచేసి వెళ్ళిపోలేదు. ఆడవారి మాటలకి అర్థాలు వేరని తెలుసు ? అందుకే జీపుదిగి "మీరుండండి. నేను చూస్తాను." అంటూ తనూ బోనెట్‌లో తలదూర్చాడు. అతను వంగేలోగా పైకిలేచి నిలబడింది అన్నపూర్ణ 'నేను చూసుకుంటానన్నానుగా ?' అంది.

"ఏం చూస్తారు ? మీరు వైర్లన్నీ పీకారు !" నవ్వుతూ వైర్లన్నీ తిరిగి యథాస్థానాల నతికించాడు రాజు.

"మీరిన్నీ పీకారుగాని పెట్రోలు సంగతి మరచిపోయారు !" అన్నాడు.

నాలిక్కరచుకుంది అన్నపూర్ణ. అవును పెట్రోలైపోతేకూడా కారు నడవదు కదూ ! అనుకుంది. 'మరైతే ఇప్పుడింకేం చేస్తారు ? నేను ఓంపేస్తారండి' అన్నాడు రాజు.

"మరి కారో ?"

"టోచేద్దాం జీపులో తాడుంది" అంటూ బదులుకోసం ఆకుండా బోనెట్ మూసి జీపుదగ్గిరకి వెళ్ళి తాడుతెచ్చాడు. కారుముందు బంపరుకిమధ్యగా తాడు కట్టి జీపువెనక్కి కట్టాడు.

'రండి' అంటూ జీపులోకి అన్నపూర్ణని ఆహ్వానించాడు.

చేసేదేంలేక అన్నపూర్ణ జీపు ఎక్కింది. ''మీరు ముందే యిల్లు ఎక్కడో చెప్పాలి. లేకుంటే మన రథం దాటేస్తుంది'' అన్నాడు తనూ ఎక్కి కూర్చుంటూ.

అన్నపూర్ణ చెప్పింది.

'అరే ఆ నొటోరియస్ పెరుమాళ్ళు గారిల్లా ?" అని అన్నాడు రాజు.

"ఎందుకు నొటోరియస్ అన్నారు ?" అడిగింది అన్నపూర్ణ.

"చండ శాసనుడని చెప్పుకుంటారు. వారికేం అవుతారు మీరు ?" కుతూహలంగా అడిగాడు.

"ఏం దగ్గిరైతే దింపేస్తారా ?" నవ్వుతూ అడిగింది అన్నపూర్ణ.

"అబ్బే, అందమైన అమ్మాయిలను ఇబ్బందుల్లో వున్నప్పుడు రక్షించటమే కదండీ, రాజకుమారుల లక్షణం! వుట్టినే అడిగాను" అన్నాడు రాజు.

"అయితే నేను వారమ్మాయిని!" అంది మంకుగా అన్నపూర్ణ.

ఓసారి స్టీరింగు వదిలేసి నమస్కారం పెట్టాడు రాజు.

"జాగ్రత్తండీ. రక్షించానంటూ..." నవ్వేసింది.

"బలేవారే అంతట్లో యాక్సిడెంటెలా చేస్తాను ?" తనూ నవ్వేశాడు రాజు.

"అదిగో ఆగేటే." అంటూ దూరంలో కన్పిస్తున్న గేటు చూపెట్టింది.

"మీరు చెప్పనక్కరలేదు. పెరుమాళ్ళుగారిల్లు అంటే నేనే దింపేసేవాణ్ని అంటూ గేటుదగ్గిర ఆపాడు జీపు

"థ్యాంక్సు. రేపు ఉదయం టాంకునిండా పెట్రోలు పోయిస్తాను" అంది అన్నపూర్ణ.

కారుకి కట్టినతాడు యిప్పేస్తూ 'అలాగే మీరు పీకినవైర్లు అన్నీ సరిగా ఉన్నాయో లేదో మెకానిక్‌ను చూడమనండి' అంటూ సలాంపెట్టి జీపు ఎక్కాడు రాజు.

జీపు వెళ్ళేదాకా చూస్తూ నిలబడింది అన్నపూర్ణ.

ఓ సారి వెనక్కితిరిగి చూశాడురాజు. అన్నపూర్ణ నిలబడి కనిపించింది. అప్రయత్నంగానే చెయ్యివూపాడు. తనూవూపింది.

కూనిరాగాలు తీస్తూ లోపలికి పరుగెత్తింది. ఆమె మనస్సెందుకో ఆనందంతో పరవళ్లు తొక్కుతూంది.

"ఏమ్మా కారు లోపలికి తేలేదు?" అంటూ పెరుమాళ్ళుగారు అడిగారు.

"పెట్రోలయిపోయింది నాన్నా. ఒకాయిన పాపం టౌ చేసి తెచ్చారు" అంది అన్నపూర్ణ.

'సరిసరి యిలాఅయితే ఎలాగమ్మా ? పెట్రోలుందో లేదో చూసుకోకుండా కారెందుకు తీసుకువెళ్ళావు ? అందుకే డ్రయివరుని పెడతానంట.' అంటూ విసుక్కున్నారు పెరుమాళ్లుగారు.

"సారీ నాన్నా. మొన్నేకదా పోయించా మనుకున్నానుగాని నిన్ననంతా మా గాంగు తెగతిరిగాం. మరిచిపోయాను," అంటూ తన గదిలోకి పరుగెత్తింది అన్నపూర్ణ.

మంచంమీద పడుకుందన్నమాటేగాని నిద్రరాలేదు. మనసేదో మధుర స్వప్నాలలో తేలిపోతోంది. మళ్ళీ ఎప్పుడు కన్పిస్తాడో అయన ? అసలు పేరే మిటో ? పనేమిటో ? అనుకుంటూ పడుకుంది. సమాధానం దొరకని ఆ ప్రశ్న లామెకి కంటిమీద కునుకు రానివ్వలేదు.

* * * *

మరునాటి ఉదయమే చెప్పేసింది నాన్నగారికి. సాయంత్రం సినిమాకి వెడు తున్నాం లేటుగావస్తానని. అనుకున్నట్టుగానే స్నేహితురాళ్ళని వెంటేసుకుని రెండింటికల్లా బయలుదేరింది – హోటల్లో దూరి టిఫిను దట్టించి అంతా సినిమాకి బయలుదేరారు. అన్నపూర్ణ అతి వుత్సాహంగా వుండడం చూసి "ఏం కథ" అని అడిగారు స్నేహితురాళ్ళు. 'ఇంకా కథలేదు. తరవాత చెప్తాన'ని నవ్వుకుంది అన్నపూర్ణ.

స్నేహితురాళ్ళని దింపేసి స్లోగా యింటిదారికి పట్టించింది కారు. ముందురోజు తన కారాగిపోయిన చోటురాగానే... అన్నపూర్ణ ముఖంమీద చిరునవ్వు వెలి సింది. 'నా పిచ్చిగాని మళ్ళీ ఎందుక్కనిపిస్తారాయన ?' అనుకుంటూ కారు స్పీడు ఎక్కించింది. యింకొంచెం దూరం వెళ్ళిందో లేదో దూరంలో కోటు భుజాన వేసుకుని నడుస్తూ కనిపించాడు రాజు. అన్నపూర్ణ ముఖం ఒక్కసారి వెల్గింది. కారు రివర్సుచేసి రాజుపక్కగా నిల్పింది "ఏం ఈరోజు జీపు ఆగిపోయిందా ?" అని అడిగింది.

"అరె మీరా ? నేనూ యిప్పుడే మిమ్మల్ని గురించి అనుకుంటున్నాను" అన్నాడు.

"అలాగా ? ఏమని అనుకుంటున్నారు ?" కుతూహలంగా అడిగింది అన్నపూర్ణ.

"అదే మీ కారేమైందీ అని."

"రండి. ఈ రోజు నేను దింపేస్తాను." అని ఆహ్వానించింది.

రాజు మాట్లాడకుండా కారెక్కాడు.

కారు స్టార్టుచేస్తూ 'ఎక్కడ దింపమంటారు ?' అంది.

"మీ యింటిముందు" అన్నాడు రాజు నవ్వుతూ.

"మా యింటిముందా ? మా యింటికి అంత దగ్గరలోనా వున్నారు మీరు ?"



అవునని తలూపాడు రాజు.

ఇద్దరి ముఖాల్లోనూ ఒకరకం ఆనందం కన్పించింది. అప్పుడే యిల్లు రాకూడదనిపించింది అన్నపూర్ణకి. కాని ఏంలాభం? వచ్చేసింది. రాజు కారుదిగేస్తూ "థాంక్యూ!" అన్నాడు.

"లోపలికి రండి. నాన్నగారిని పరిచయం చేస్తాను..." అంది.

"ఈసారి..." అంటూ ముందుకు సాగిపోయాడు రాజు.

ఇంక కారుని గేటులోంచి లోపలికి తీసుకువెళ్ళడానికి కూడా విసుగనిపించింది అన్నపూర్ణకి. తనూ అక్కడేదిగేసి లోపలికిపోతూ 'రంగన్నా, కారు లోపలికి తెచ్చిపెట్టెయి' అని కేకవేసింది. రంగన్న గేట్లు బారుగా తెరిచాడు. కారుతెచ్చి గారేజిలో పెట్టేశాడు.

*            *            *            *

రాత్రి భోజనాలదగ్గిర ముభావంగా కూర్చుంది అన్నపూర్ణ.

"ఏమ్మా, సరిగ్గా ఏం తిండంలేదు ? బద్ధకంగా కానీ లేదుకదా ?" ఆత్రంగా అడిగారు పెరుమాళ్ళుగారు.

"లేదునాన్నా నాకు ఒంట్లో బాగానేవుందే... ఆకలిగా లేదు అంతే... మీరు తినండి" అంటూ తండ్రికి వడ్డించడం ప్రారంభించింది.

'నిన్న నా కారు టౌ చేసినాయినది మనింటి దగ్గిరేట నాన్నా యిల్లు' అంది.

"ఎవడతగాడు ? మనిల్లుదాటాక అన్నీ చిన్న చిన్న యిళ్లేకదా ?'' అన్నారు పెరుమాళ్ళుగారు..." నువ్వితనంటే జ్ఞాపకం వచ్చింది తల్లీ, మన నరసింహం గారు లేరూ నీకు పెళ్ళికొడుకుల ఫొటోలు చూపెట్టమని యిచ్చారు...'' అంటూ లేచివెళ్ళి ఓ అరడజను ఫొటోలు పట్టుకొచ్చి అన్నపూర్ణ చేతికిచ్చారు.

అన్నపూర్ణ వాటిని పట్టుకుని మేడమీద తన గదిలోకి వెళ్ళిపోయింది.

పెరుమాళ్లుగారు కూడా లేచివచ్చి హాల్లో వాలుకుర్చీలో పడుకున్నారు. 'ఏ కుర్రాడేనా నచ్చితే వాడిచేతిలో దీన్ని పెట్టి నిశ్చింతగా వుంటాను కదా ?' అనుకున్నారు.

మేడమీద పడకగదిలో మంచంమీద పడుకుని పెళ్ళికొడుకుల ఫొటోలు చూస్తోంది అన్నపూర్ణ. ఆమెకి అన్నిముఖాలూ రాజు ముఖంలాగే కన్పిస్తున్నాయి... నవ్వుకుంటూ పడుకుంది.

హఠాత్తుగా కేకలు విన్పించి లేచి కిటికీదగ్గిరికి వెళ్ళింది అన్నపూర్ణ.

మేనేజరు నరరసింహంగారి యింట్లోంచి కేకలు విన్పిస్తున్నాయి.

"ఏం మనిషో - ప్రతిదానికీ అరుస్తాడు " అనుకుంటూ కిటికీరెక్కలు జేర వేసింది.

*　　*　　*　　*

"పిల్లల్నిలా చదివిస్తే పిల్లలింకెలా పైకి వస్తారు ? యింక నువ్వెందుకు ?" భార్యని గట్టిగా గదమాయిస్తున్నారు నరసింహంగారు. సరస్వతమ్మగారు మారు మాటాడక నిలబడ్డారు.

"పుస్తకాల్లోకి వెధవ సినిమాబొమ్మ లెలావచ్చాయని అడిగావా ?... తల్లికి శ్రద్ధలేకపోతే యింకా పిల్లలని దేవుడుకూడా క్రమశిక్షణలో పెట్టలేడు" అంటూ విసురుగా పిల్లలకేసి తిరిగారు.

ఒణికిపోతూ నిలబడ్డారు యిద్దరూ.

"ఎవరివి ? చెప్పండి. లేకపోతే చీల్చేస్తాను" అంటూ గోడకితగిల్చిన కొరడా కేసి నడిచారు. అదిచూసి బేబీ బావురుమంది. రఘు మటుకు భయం పీకుతున్నా గంభీరంగా నిలబడి చెల్లెలి భుజంమీద చేయివేశాడు ఫరవాలేదన్నట్టు.

"అవి నాకు తెలిసిన అమ్మాయివి నాన్నారూ. నాన్నారూ, రేపిచ్చేస్తాను" అని చెప్పేసి గట్టిగా ఏడుస్తూ తల్లిని చుట్టపెట్టేసుకుంది బేబీ.

"యింకెప్పుడూ యిలా చెయ్యరండీ, నే చెప్తాను" అంటూ కొట్టవద్దని ప్రాథేయపడుతూ కూతుర్ని దగ్గిరగా తీసుకుంది సరస్వతమ్మ.

"మళ్ళీ ఈ సారిలా చేస్తే చంపేస్తాను జాగ్రత్త!" అంటూ తన గదిలోకి వెళ్ళిపోయారు నరసింహంగారు. వంటింటి తలుపు వేసివద్దామని వెళ్ళిన సరస్వతమ్మకి అక్కడ ఔట్ హవుస్‌లో కాపురం వుంటున్న సంతానంగారి కూతురు సావిత్రి నిలబడి వుండడం చూసింది.

"ఏం సావిత్రీ ఎంతసేపైందీ వచ్చి ? పిలవలేకపోయావా ?" అంది.

"నాలుగుగ్లాసులు బియ్యం వుంటే యివ్వండి పిన్నిగారు" అడగలేక అడగలేక అడిగింది సావిత్రి. పట్టుమని పధ్నాలుగేళ్ళు నిండని సావిత్రి కళ్ళు గుంటలుపట్టి ముఖం పీక్కుపోయి వుంది.

"తీసుకెళ్ళమ్మా, సాయంత్రమే రాకపోయావా ?" అంటూ బియ్యం అందించింది. సావిత్రి కృతజ్ఞతగా ఆమెకేసి చూసిందేగాని ఏం చెప్పలేకపోయింది.

"వెళ్ళు. బాగా ఆలస్యం అయిపోయింది" అంటూ సరస్వతమ్మగారే హెచ్చరించారు.

సావిత్రి వెళ్ళాక తలుపులు వేసి లోపలికి వచ్చారు.

"ఎవరితో మాట్లాడుతున్నావు ?" గద్దించినట్టు అడిగారు నరసింహంగారు.

"సంతానంగారమ్మాయండీ, బియ్యం నిండుకున్నాయి కాబోలు...పాపం!" అంది నిట్టూరుస్తూ

"అలా అని ఎంతమందికని సప్లయిచేయకలం బియ్యం ? వచ్చినదాంట్లో సద్దుకు బ్రతకడం అలవాటు చేసుకోలేని సంతానంగారింటికిక నువ్వేం సహాయం చెయ్యక్కరలేదు" కసిరారు.

"ఏం చేస్తారండీ, పిల్లలు ఎక్కువ..."

"అదెవరి తప్పు ? వారి తప్పుకి మనమా బాధ్యులం ?" అంటూ పడకగదిలోకి దారితీశారు నరసింహంగారు.

ఉస్సురంటూ పిల్లలకి దుప్పట్లు సరిచేసి తనూ పడకగది చేరింది... క్రమ

శిక్షణ పేరిట యీయనగుండె రాయి అయిపోతోంది- అనుకుందామె కాని ఏం చెయ్యకలదు ?

*   *   *   *

సంతానంగారు కుక్కిమంచంలో కూర్చుని చుట్ట కాలుస్తున్నారు! దీపందగ్గిర కూర్చుని అప్పుతెచ్చిన బియ్యం బాగుచేస్తూంది సావిత్రి. అదే గదిలో ఓ మూల కూర్చుని సంతానం తల్లి ఉట్టినేసాధిస్తూ కూర్చుంది. వంటింట్లో ఢీలాపడి గోడకి చేరపడి కూర్చున్న సంతానంగారి పెళ్ళాం కాంతం ఆ సాధింపులకి వదలకుండా బదులు చెప్తూనే వుంది. బియ్యం ఏరుతూనే జాలిగా తండ్రికేసి చూసింది సావిత్రి. "ఓ క్షణంలో వండేస్తాను నాన్నా, నానమ్మమాటలకేం ?" అంటూ చేట పట్టుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"సరేలేమ్మా, నేనలా కాస్సేపు తిరిగివస్తాను" అంటూ కండువా భుజాన వేసుకుని బయటికి నడిచారు సంతానంగారు.

అప్పటికే బాగా చీకటిపడిపోయింది. పిల్లలు ఎక్కడపడితే అక్కడ అస్తవ్యస్తంగా పడుకుని నిద్ర కొరిగారు. వాళ్ళలో ఒకడిపక్కగా కొంచెం చోటు చేసుకుని కాంతం నడుంవాల్చింది. సావిత్రి మాత్రం తండ్రి తిరిగి రావడం కోసం ఎదురుచూస్తూ అరుగుమీద స్తంభానికి చేరబడి కూర్చుంది.

*   *   *   *

ఆఫీసురూములో రుసరుసలాడుతూ సంతానం రాకకోసం ఎదురుచూస్తున్నారు నరసింహంగారు. అన్నీ తప్పుఆర్డర్లు వెళ్ళి పని మళ్ళీ మొదటికి వచ్చింది.


"ఇప్పుడటయ్యా ఆఫీసుకి రాడం ? టైమెంతైంది ?" గడియారంకేసి చూపిస్తూ అడిగారు సంతానం లోపలికి అడుగుపెట్టగానే.

"చిత్తం కాస్త ఆలస్యం అయింది. బస్సుదొరక్క నడిచివచ్చాను," అన్నాడు సంతానం.

"ఆహా! బస్సు దొరక్కా ! బస్సుకి డబ్బుల్లేకా ? ఆ బయలుదేరేది కాస్త ముందరే బయలుదేరకపోయావా ?...చూడు వారంక్రిందట పంపిన కాగితాలన్నీ తిరిగొచ్చాయి." అంటూ సంతానం ముందో ఫైలు విసిరారు నరసింహంగారు.

"చిత్తం. సరిచేస్తాను." అంటూ ఫైలు తీసుకుని తన సీటుకేసి నడిచారు సంతానం.

"తప్పులు చెయ్యడం ఎందుకు ? సరిదిద్దుకోడం ఎందుకు ? యిలా అవుతూంటే యింక లాభంలేదు సంతానంగారూ, మీరు యింకా జాగ్రత్తగా పనిచెయ్యాలి."




కసురుకుంటూ యింకోఫైలు అందుకున్నారు నరసింహంగారు. ఉస్సురంటూ కుర్చీలో కూలబడి నుదుటపట్టిన చెమటలు పైపంచెతో ఒత్తుకుంటూ ఫైలు తిరగ వేయడం ప్రారంభించారు సంతానంగారు.

*　　*　　*　　*

అన్నపూర్ణ అందంగా డ్రస్సు చేసుకుని కారు తీసుకు బయలుదేరింది- దారిలో ఎక్కడేనా రాజు కనిపించక పోతాడా అన్న ధీమాతో. ఆమె కోరు కున్నట్టె రాజు బస్సుస్టాండులో కన్పించాడు. కారాపింది. రాజు కారుదగ్గరకి వచ్చాడు.

"యింకా మీ రథం రడీ కాలేదా!" తనప్రక్కసీటు చూపిస్తూ అడిగింది అన్నపూర్ణ.

"జీపులు పనిచేసినన్నాళ్లు బాగా పనిచేస్తాయి. రిపేరుకి వస్తే పెద్దరిపేరే. రేపో ఎల్లుండో వచ్చేస్తుంది" అంటూ తలుపు తెరిచి ఎక్కి కూర్చున్నాడు.

"ఎటు ఆఫీసు?" కుతుహలంగా అడిగింది.

"మీరు ఎటు తీసుకువెడితే అదే నాకీరోజు ఆఫీసు."అన్నాడు.

"గుడ్. అయితే యింటికి రండి," అంటూ కారు వెనక్కి తిప్పింది.

"ఎందుకు?" అడిగాడు రాజు.

"మా నాన్నగారికి చూపించాలి మిమ్మల్ని," అంది.

"కొత్త హాండ్ బాగూ, కొత్త చీరా, కొత్త నగా కొన్నట్టు నన్నెందుకు తీసుకెళ్లి చూపించటం?" అడిగాడు.

"మా నాన్నగారుట్టినే ఫొటోలు చూపిస్తున్నారు. నేను మనిషినే చూపిద్దామని" అనేసి సిగ్గుపడింది అన్నపూర్ణ.

"ఎందుకు ఫోటోలు చూస్తున్నారు? మీనాన్నగారు కొంపతీసి సినిమాకాని తియ్యడానికి ప్రయత్నాలు చెయ్యటం లేదుకదా?" అన్నాడు.

"అక్కడికి అర్థంకానట్టు!" అంటూ తమ యింటి గేటులోకి కారు తిప్పి హారన్ గట్టిగా కొట్టింది. రంగయ్య పరుగున వచ్చి గేట్లు బార్లా తెరిచాడు. కారు తిన్నగా పోర్టికోలో ఆపింది.

'రండి' అంటు రాజుని ఆహ్వానించింధి.

హాల్లో కూతురు రాకకోసం ఎదురుచూస్తున్న పెరుమాళ్లుగారికి అన్నపూర్ణతో కూడా వస్తూన్న రాజు కన్పించాడు. ఓసారి కళ్లజోడు తుడిచి పెట్టుకున్నారు. ఆ క్షణంలో యిద్దరూ చూడముచ్చటగా కన్పించారాయనకి.

"వీరే నాన్నా ఆ రోజు కారు టో చేసింది. పేరు టో రాజుఅంటూ పరిచయం చేసింది.

'నమస్కారం.' అంటూ చేతులు జోడించాడు రాజు.

'రా నాయనా, కూర్చో' అంటూ తనపక్కనే చోటు చూపించారు పెరుమాళ్లగారు.

'అన్నపూర్ణ చెప్పింది. చూడు పూర్ణా, కొంచెం కాఫీ పెట్టమను....' అని కూతురికి పురమాయించారు.

"నేనిక్కడ కంస్ట్రక్షన్ యింజనీరుగా పనిచేస్తున్నానండి. ఓ సంవత్సరం అయిందిక్కడికి వచ్చి." అన్నాడు తనని తను పరిచయం చేసుకుంటూ.


"అయితే అటూ యిటూ తిరిగే ఉద్యోగమా?" అడిగారు.

"అవునండీ, మా కంపెనీ ఎక్కడ కాంట్రాక్టు ఒప్పుకుంటే అక్కడికి వెడుతూవుంటాను."

"మరి మీ కుటుంబం?"

"నాకంత నా అన్నవాళ్లు లేరండీ, ఒక్క మేనమామ గారుండేవారు. ఆయనా ఈ మధ్యనే పోయారు. అంచేత నా కంత యిబ్బందిగా లేదు. అన్నివూళ్లూ తిరుగుతూవుంటాను. నాకదే బాగుంటుంది" అన్నాడు రాజు.

"కొన్నాళ్లకయినా సెటిలవాలిగా?"




"అప్పుడు చూడొచ్చు." అంటూ మాట మార్చాడు రాజు.

పెరుమాళ్లుగారు తన వ్యాపారం విషయాలన్నీ వివరంగా చెప్పడం ప్రారంభించారు. కుతూహలంగా వింటున్న రాజుని చూసి ఒళ్లుమండింది అన్నపూర్ణకి. కాస్సేపు అన్నీ మాట్లాడి యిక వస్తానండీ' అంటూ లేచాడు రాజు.

'రంగన్న దింపేసి వస్తాడుండండి' అంటూ రంగన్నని కేకవేయడానికి వీధిలోకి వచ్చింది అన్నపూర్ణ. ఆమె వెంటనే వెళ్తూ "అక్కర్లేదండీ, నాకు టౌనులో పనుంది. అటెడుతూంటేనే ఈ యింటర్వ్యూకి తీసుకొచ్చారు మీరు!" అంటూ అన్నపూర్ణకి సన్నగా కన్నుగీటాడు.

అన్నపూర్ణ బుగ్గలు సిగ్గుతో ఎర్రబడ్డాయి.

'మళ్లీ ఎప్పుడు కన్పిస్తారు?' వినీవినబడనంత నెమ్మదిగా అడిగింది.

"ఎక్కడో దారి కాసి పట్టారుగా. అప్పుడు" అంటూ గేటు దాటి బయటికి నడిచాడు రాజు.

అన్నపూర్ణ మనస్సు మహ ఆనందంగా వూగిసలాడుతోంది.

కూనిరాగాలు తీస్తూ లోపలికి వచ్చింది.

అక్కడే కూర్చుని వున్న పెరుమాళ్లుగారు "ఏమ్మా? అబ్బాయిల ఫోటోలు చూశావా?" అడిగారు.

"ఎందుకునాన్నా? అందుకేగా మనిషినే తీసుకొచ్చి చూపించాను" అంటూ మేడమెట్లకేసి పరుగెత్తింది. కూతురి మనస్సు గ్రహించకపోలేదు పెరుమాళ్లు

గారు. ఆయనకీ రాజునచ్చాడు. ముఖ్యంగా ఒంటరిగాడు. యిల్లరికానికి వస్తాడు. అదే ఆయనకి కావలసినది.

''ఇలారామ్మా. అలావెళ్లిపోతేఎలా?" అంటూ కూతుర్ని కేకేశాడు.

"ఏమిటి నాన్నా?" అంటూనే వచ్చి తండ్రి పక్కనే కూర్చుంది.

"అబ్బాయి బాగానే వున్నాడు. కాని నిలకడైన ఉద్యోగం కాదమ్మా." అన్నారు అనుమానంగా.

"అలాంటి ఉద్యోగాలకి నిలకడేమిటినాన్నా. పనిఉన్న చోటికి వెళ్లాలని చెప్పారుగా." అంది అన్నపూర్ణ.

"అది సరే. మనింట్లో వుండడానికి ఒప్పుకుంటాడంటావా?" అనుమానంగా అడిగారు.

"నే ఒప్పిస్తా నాన్నా. నీకు నచ్చితేచాలు"అంది.

''అయితే నాకు నచ్చాడమ్మా. అందంగా హుందాగా వున్నాడు. మన వ్యాపారం చూసుకున్నా చాలు- ఆ ఉద్యోగం మానేసి" అంటూ కూతురి తల నిమిరారు పెరుమాళ్లుగారు.

అన్నపూర్ణ ఆనందానికి అవధుల్లేవు. మనసు వేయి కోయిలలై కూస్తూంది- వస్తూన్న వసంతాన్ని వూహించుకుని.

* * *

మరునాడు రాజు అన్నట్టే మాటేసి పట్టుకుంది అన్నపూర్ణ. ఆఫీసులో పని వుందనీ సాయంత్రం వస్తాననీ తప్పించుకున్నాడు.

ఇక సాయంత్రందాకా ఎలగో ఓపికపట్టి మళ్లీ కారు తీసింది బయటికి. కాలుకాలిన పిల్లిలాగ తిరుగుతున్న కూతుర్ని చూసి నవ్వుకున్నారు పెరుమాళ్ల గారు.

రాజూ అన్నపూర్ణా అలా తిరిగితిరిగి ఓచోట కారాపి కూర్చున్నారు. చుట్టూ ప్రశాంతంగావుంది.

"ఇప్పుడు చెప్పు. ఏమిటి మీనాన్నగారి ఉద్దేశ్యం? ఎవడీ అనామకుడు? వాడికీ మనకీ సాటి ఎక్కడ అని కేకలేశారా?"

"లేదు. ముహూర్తం ఎప్పుడు పెట్టించనూ, అని అడిగి రమ్మన్నారు... చూడండి రాజూ. మీరూ ఒంటరివారు. నేనూ ఒక్కర్తెనే. హాయిగావుందాం. ఆనందం పంచుకుందాం. అతనిచేయి తనచేతిలోకి తీసుకుంది. రాజు చేయి గట్టిగా ఓసారి నొక్కాడు. అతని మనస్సు పరిపరి విధాల పోతున్నది.



"చూడు అన్నపూర్ణా, నేను ఎప్పుడు పడితే అప్పుడు ఎక్కడికి పోస్టు చేస్తే అక్కడికి వెళ్లాలి. నువ్వు గారాబంగా సుకుమారంగా ఐశ్వర్యపు ఒడిలో పెరిగినదానివి. నన్ను చేసుకొని ఏం సుఖపడతావు చెప్పు?" అన్నాడు.

"ప్రేమించినవాడి దగ్గిరే - ఆడది తన స్వర్గం నిర్మించుకుంటుంది రాజూ. నువ్వు అడవిలో వున్నా నాకది నందనవనమే. నీతోపాటు పస్తులు పడుకున్నా నాకది విందుభోజనమే," అంది.

ఎవరూ చుట్టుపక్కల లేరని చూసి అన్నపూర్ణని దగ్గిరకు తీసుకొని ముద్దు పెట్టు కున్నాడు రాజు.

"అన్నపూర్ణా, సుఖమూ దుఃఖమూ- నేను నీతో పంచు కొందుకు యిష్టపడుతున్నాను." అంటు గట్టిగా హృదయానికి హత్తు కున్నాడు.

* * *

పెరుమాళ్లగారి యింటికీ, అన్నపూర్ణకీ కూడా పెళ్లికళ వచ్చింది. ఇల్లంతా అందంగా అలంకరించారు. సంతానంగారు, నరసింహంగారు పూను కొని పెళ్లిపనులు చేయిస్తున్నారు.

శుభముహూర్తాన రాజు- అన్నపూర్ణ దంపతులయ్యారు.

విందులు వినోదాలు ఓహో మనిపించాయి.

అంత సరదా సమయంలో కూడా నీళ్ల ఒలకపోసినందుకు మండిపడ్డారు నరసింహంగారు - నలుగురిలో మసులుకోవడం తెలియదని ఆయనగారికి కోపం వచ్చింది.

కాంతంతో కలిసి సరస్వతమ్మగారు పడకగది అలంకరిస్తున్నారన్నా మాటే గాని ఆలస్యం అయిపోయిందని యింటిదగ్గర భర్త ఏం కేకలు వేస్తారో ననే భయం పీకుతూనే వుందామెని.

అన్నపూర్ణని గదిలోకి పంపి కాంతం సరస్వతమ్మగారు వెళ్లిపోయారు.

గదిలోకి రాగానే రాజు అన్నపూర్ణని తన కౌగిట చేర్చుకున్నాడు.

అన్నపూర్ణ ఆనందంలో ఉక్కిరి బిక్కిరయింది- 'జీవితాంతం యింత సంతోషంగా, యింత సుఖంగా, ఎడబాయక మనం బ్రతకాలి' అనుకున్నారా నూతన దంపతులు.

ఇంట్లో అల్లుడు తిరుగాడు తుంటే, కూతురూ అల్లుడూ కల కలలాడుతూ కబుర్లు చెప్పుకుంటూవుంటే, పెరుమాళ్లగారికి ఎంతో హాయిగా వుంది. గుండె బరువు తేలికైనట్టువుంది.

* * *

రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయి.

ఓ ఎనిమిది మాసాలు గడిచేసరికి రాజుకి బదిలీ అయింది- ఉత్తరాదికి.

"ఎలా వెడతావయ్యా?" అంటున్నారు పెరుమాళ్లగారు.

"నే ముందే చెప్పాను కదండీ, నా పని అలాంటిదని," అన్నాడు రాజు.

'నే రానని చెప్పెయ్,' అన్నారు.

"అదంత సులభం కాదండీ, అయినా నేనెందుకు వెళ్లకూడదు?" అడిగాడు రాజు.

"అబ్బ! నాన్న నెందుకండీ యిప్పుడు నొప్పించడం? ముందు లీవు పెట్టండి తరవాత చూసుకోవచ్చు" నని భర్తని ఒత్తిడిచేసింది అన్నపూర్ణ.

ఆ రాత్రి భార్యతో చాలాసేపు చర్చించాడు రాజు, మనిషికి అన్నిటితో పాటు తృప్తి నిచ్చే ఉద్యోగం కూడా ఎంత ముఖ్యమో.

అన్నపూర్ణ తన ప్రేమతో అతగాడి మాట మరిపించిందప్పటికి.

రాజుకి కొంచెం యిబ్బందిగానే తోచింది. కాని ఏం చేస్తాడు? ఇటు భార్యని కాదనలేడు, అటు తన కిష్టమైన ఉద్యోగానికి స్వస్తిచెప్పలేడు. క్లిష్టమైన పరిస్థితిలో పడ్డాడు రాజు. నెమ్మదిమీద ఎలాగైనా అన్నపూర్ణని ఒప్పించాలని తలపోశాడు.

*                *                *

ఆ రోజు ఆదివారం కావడంతో ఉదయం వచ్చి కూర్చున్నారు నరసింహంగారు.

"అంతా బాగానే ఉందయ్యా. అల్లుడెలాగేనా ఏదో ఉద్యోగం పట్టుకు ప్రాకులాడుతానంటాడేం? హాయిగా కాలిమీద కాలేసుకుని కాగితంమీద కథ నడిపించే పనికదా! ఎలాగయ్యా నచ్చచెప్పడం?" గట్టిగా అంటున్నారు పెరుమాళ్లుగారు.

నరసింహంగారు బదులుచెప్పకుండానే తలూపుతున్నారు.

"వాళ్లిద్దరూ యీ యిల్లు వదలిపోతే-నేనెందుకయ్యా?... ఏదో ఒక ఆలోచన చెప్పు," అన్నారు.

"చూద్దాం లెండి. ప్రస్తుతాని కింకా మీవుమీదే ఉన్నారుగా."

"అవుననుకో. వదిలేయ్‌మంటున్నాం- నేనూ అమ్మాయీనూ, అల్లుడు కొంచెం మంకుపట్టు రకమే."

*                *                *

రాజు తలొంచుకు లోపలికి వస్తున్నవాడల్లా మామగారి ఆఫీసురూంలోంచి వస్తున్న మాటలు విని ఆగిపోయాడు.

"ఇదంతా అతగాడికి చెప్పాలటయ్యా, రాడని రాసెయ్," అని ఆర్డరు వేశారు.

రాజుకి ఒక ఫారిన్ కంపెనీవారు ఆఫ్ఘనిస్తాన్ వచ్చి మిషనరీ ఎరెక్టు చెయ్యమని యిచ్చిన ఆఫరు అది.

రాజు మండిపడ్డాడు.

విసురుగా తమ గదిలోకి వెళ్లిపోయాడు.

కోపంగా నున్న భర్తదగ్గరకి వెళ్లి కోటు అందుకుంటూ "ఎందుకంత చికాకు?" గోముగా అడిగిందది.

"కింద మీ నాన్నగారేం చేస్తున్నారో చూసిరా, అన్నపూర్ణా నేను యిల్లరికం వచ్చినమాట నిజమేగాని వ్యక్తిత్వాన్ని కూడా అమ్మేసుకున్నానంటావా.

నాకిష్టమైన ఉద్యోగం నేను చెయ్యకూడదు. మీ నాన్నగారి కిష్టమైన వ్యాపారమే చూసుకోవాలా?" అడిగాడు.

తండ్రి చేసినపని తెలుసుకుని అన్నపూర్ణకూడా బాధపడింది. తిన్నగా క్రిందికి వెళ్లింది.

"ఏమిటి నాన్నా నువ్వు చేసేది? వారి కెంత కోపంగా వుందో తెలుసా? ఓ సారి వారితో చెప్పి చేస్తే ఏం పోయింది చెప్పు?" అని నిలదీసింది.

"నా స్వార్థం తల్లీ. నా స్వార్థం నాది. అతగాడివెంట నువ్వూ వెడతావుగా. అప్పుడీ ముసలివాడికెవరమ్మా దిక్కు?"

"నాన్నా, అలా అనకండి నాన్నా" అంటూ తండ్రి గుండెల్లో తలదాచుకొంది అన్నపూర్ణ.

* * *

"అమ్మా, సావిత్రీ ఓ అర కప్పు కాఫీ చేసివ్వకలవా తల్లీ" అంటూ కుక్కిమంచంలో కూలబడ్డాడు సంతానం.

"ఇస్తాన్నాన్నా," అంటూ వంటింట్లోకి పరుగెత్తింది సావిత్రి. కాఫీ డబ్బా కాళీ! తక్షణం అలాగే పెరటి దోవంట అన్నపూర్ణ వంటింట్లోకి వెళ్ళింది- కాఫీ పొడి బదులుతేడానికి.

నూకాలు ఓ గరిటెడు కాఫీపొడి తీసి పంపింది సావిత్రిని. సావిత్రి అంత త్వరగానూ యింటికివచ్చి కాఫీ కాచడం ప్రారంభించింది.

కాఫీ ఓ గ్లాసులో పోసి తండ్రి దగ్గరకి వచ్చి అందించపోయింది.


"నాకియ్యి అక్కా" అంటే "నాకియ్యి" అంటూ పొలోమని అంతా అందుకోపోయి ఆ గ్లాసు కాస్తా ఒలకపోశారు

తండ్రికేసి జాలిగా చూసింది సావిత్రి.

"అయినా రాత్రిపూట లేటుగా యిప్పుడు కాఫీ ఏమిటి?" అంటూ విసుక్కుంది కాంతం.

"పెందరాడే వస్తేమటుకు వండి వార్చేస్తున్నావులే" అంటూ అత్తగారు సాధింపు ప్రారంభించేసరికి... 'నువ్వూరుకోవే!' అని తల్లిని ఓ కేకవేసి కండువా దులిపి భుజానవేసుకుని బయటకి నడవబోయాడు. యింతట్లోనే లోపలికి వచ్చాడు పెద్దకొడుకు. "ఏరా రామూ ఎక్కడి కెళ్ళావు?" అడిగింది సావిత్రి.

అక్కగారి చేతికి ఓ పదిరూపాయిల కాగితం అందించాడు రాము... "బియ్యం తెప్పించక్కా" అంటూ. సావిత్రి 'ఎక్కడివిరా?' అని అడిగేలోపల అంతా




నాకు బిస్కట్లు, నాకు చాక్లెట్లు అంటూ గోల ప్రారంభించారు. లోపలికి వెళ్ళి పోయింది సావిత్రి.

రాము బయటికి నడిచాడు — ఈ గోల పడలేక.

* * * *

అన్నపూర్ణ చాలా సంతోషంగా వుంది.

ఆ రోజు ఉదయం లేడీడాక్టరు దగ్గిరకి వెళ్ళివచ్చింది.

ఆమె ఖాయంగా చెప్పింది.

ఒక్కసారీ వార్త నరసింహంగారి భార్యకీ, సంతానంగారి భార్యకీ - అందరికీ తెలిసిపోయింది నూకాలు ధర్మమా అని.

పెరుమాళ్ళుగారి ఆనందానికికఅంతేలేదు-'యింకెక్కడికి వెడతాడు అల్లుడు?' అనుకున్నారు గర్వంగా.

రాజుకూడా చాలా ఆనందంగా ఉన్నాడు. హుషారుగా యీలవేసుకుంటూ వస్తున్న భర్తను చూసి - యీయన కెలా తెలిసిపోయింది చెప్మా! అనుకుందో క్షణం అన్నపూర్ణ.

మేడమీదికి వస్తూనే భార్యని గట్టిగా కౌగలించుకుని - 'ఒక శుభవార్త!' అన్నాడు.

"కాదు రెండు శుభవార్తలు?" అంది అన్నపూర్ణ.

"నిజంగానా ? చెప్పావుకాదేం ?" అంటూ భార్యని మంచంమీద కూర్చోపెట్టి తన జేబులోంచి కాగితం తీసి యిచ్చాడు. అది అతని ఉద్యోగం ఆర్డరు కాగితం. అన్నపూర్ణ తెల్లబోయింది.

"ఇలా ఫారిన్ వెళ్ళే ప్రయత్నంచేస్తున్నానని చెప్పేనాలేదేం ?" నీరసంగా అడిగింది.

"ఎందుకు, మీ నాన్నా ఆ నరసింహంగారు కలిసి చెడగొట్టడానికా ?... చూడు ఏడేళ్ళు బాండు రాశాను." అన్నాడు.

"ఏడేళ్ళే ?"

"అవును. హాయిగా మన జీవితాలు మనం తీర్చిదిద్దుకుందాం-ఆ ఏడేళ్ళలో... నువ్వూ-నేనూ-మన బాబూ" అన్నాడు భార్యని కౌగలించుకుంటూ.

లేని వుత్సాహం తెచ్చుకుంది అన్నపూర్ణ.

'అవును ఎన్నాళ్ళు ఆయన యిష్టంలేని పని నాకోసం చేస్తారు ?' అని సర్ది చెప్పుకుంది.

"మీరే నాన్నకి చెప్పండి" అంది.

"అలాగే" అన్నాడు రాజు.

రాజు బట్టలు మార్చుకుని కిందికి వచ్చాడు. పెరుమాళ్ళుగారు చాలా వుత్సాహంగా వున్నారు.

"రావోయ్, రా. నాకు మనవడు పుడతాడు తెలుసా ?" అన్నారు మీసం మెలివేస్తూ.

"యిప్పుడే తెలిసింది. మీ కింకో శుభవార్త కూడా చెప్పాలి. నేను ఏడేళ్ళ బాండు రాశాను. విదేశాల్లో పనిచెయ్యడానికి" అన్నాడు.

అంత వుత్సాహంగా వున్న పెరుమాళ్లుగారి ముఖం దీపం ఆర్పినట్టు అయిపోయింది.

"అది ఒట్టిమనిషి కాదని తెలిసీ యిలా ఎలా నిర్ణయించావోయ్?" అన్నాడు నీరసంగా.

"అక్కడేం డాక్టర్లుండరా, సౌకర్యాలుండవా మీ పిచ్చిగాని!" అని నవ్వేశాడు రాజు.

*　　*　　*

ప్రయాణాని కన్నీ సిద్ధంచేసుకుంటుంది అన్నపూర్ణ. ఓ పక్క వేవిళ్లు. ఓ ప్రక్క తండ్రిమీద బెంగ. ఓ ప్రక్క భర్త తనకిష్టమైన పని చేస్తున్నందుకు

సంతోషం. విభిన్నపు టనుభూతులలో సతమతమై పోతుంది అన్నపూర్ణ. ఇంక రెండువారాల్లో బయలుదేరుతారనగా మేడమెట్లు మీంచి పడ్డారు పెరుమాళ్ల గారు. ఎదురుచూడని ఈ పరిణామానికి అన్నపూర్ణ రాజు కూడా నిశ్చేష్టు లయ్యారు.

ఆస్పత్రిలో ఆర్నెల్లుండాలన్నారు-కాలికి ఫ్రాక్చర్ అన్నారు.

రాజు ఒకనిశ్చయానికి వచ్చాడు ప్రస్తుతానికి అన్నపూర్ణను వదిలి తను వెళ్లడానికే నిశ్చయించు కున్నాడు

కొన్నాళ్లపాటు ఆస్పత్రిలో వుంటే యింక యింట్లోనే కాలు కదపక వుండొచ్చు నన్నారు డాక్టర్లు. కొంచెం ధైర్యం వచ్చింది రాజుకి.

ప్రయాణపు తేదీ దగ్గరవుతున్నకొద్దీ అన్నపూర్ణకి దిగులు ఎక్కువ అవుతోంది.

రాజు మామగారితో చెప్పాడు-అన్నపూర్ణని ఆయనకి సహాయంగా వదలి తనువెడతానని.

''మూడేళ్ల తరువాత సెలవిస్తారు అప్పుడు వస్తాను" అన్నాడు.

మూడేళ్లపాటు రాజును చూడకుండా ఎలావుండ కలను? అని వాపోయింది అన్నపూర్ణ.

"చిన్నబాబుతో ఆడుకుంటూ నన్ను మరిచిపోతావు!" అని ధైర్యం చెప్పాడు రాజు.

ఆ రోజు ప్రయాణం.

ధైర్యంగా ఏర్‌పోర్టుకి వెళ్ళి భర్తని సాగనంపింది అన్నపూర్ణ.

తరుచు వుత్తరాలు రాస్తూ వుండమనీ, ఆరోగ్యం జాగ్రత్త అనీ, ఏమాత్రం వీలున్నా బాండ్ కాన్సిలు చేసి వచ్చేయమనీ మరీమరీ చెప్పింది.

భార్యని దగ్గిరకి తీసుకుని "ధైర్యంగావుండు. నేను నిన్నే తల్చుకుంటూ నిమిషాలు యుగాల్లా గడుపుతాను" అంటూ ప్లేను ఎక్కాడు రాజు.

ఎంత ఏడవకూడ దనుకున్నా అన్నపూర్ణ కళ్లు నీటితో నిండాయి.

ధైర్యంగా నిలబడి ప్లేను లేవడం చూసింది. కళ్లు తుడుచుకుని, కారు తీసుకుని ఆస్పత్రికేసి నడిచింది.

"మిమ్మల్ని అనవసరంగా విడదీశానమ్మా, పాపిష్టివాడిని" వాపోయారు పెరుమాళ్లుగారు.

"విధిని ఎవరూ తప్పించలేరు నాన్నా, నువ్వేం బాధపడకు." అని తండ్రిని ఓదార్చింది.

అది మొదలు యిల్లూ ఆస్పత్రీగా-నాలుగు నెలలు ఆలోచనలే లేకుండా గడిపింది అన్నపూర్ణ.

నాలుగు నెలల తరువాత డాక్టర్లు తండ్రిని యింటికి తీసుకువెళ్లవచ్చుననీ, జాగ్రత్తగా వుంటే చాలుననీ చెప్పారు. తండ్రిని యింటికి తీసుకొచ్చేసింది అన్నపూర్ణ.

వ్యాపారం విషయాలన్నీ పడకమీదనుంచే చూసుకోవడం ప్రారంభించారు-పెరుమాళ్లుగారు.

తండ్రి పని కాస్త తగ్గడంతో అన్నపూర్ణ మనస్సు ఎడబాటు కాటుకి గురి కాసాగింది. అలసట కూడా ఎక్కువ అయింది నెలలు ముదరడం మూలంగా.

* * *

అస్సలు ఎదురు చూడనిపూట అన్నపూర్ణకి నెప్పులు మొదలయ్యాయి.

పెరుమాళ్లుగారు కుర్చీలో కూర్చునే హడావిడిపడిపోతున్నారు. తన అశక్తతకి బాధపడి పోతున్నారు. నరసింహంగారు తక్షణం కారులో అన్నపూర్ణని ఆస్పత్రిచేర్చారు. సాయంత్రానికల్లా "పండంటికొడుకుని కంది అన్నపూర్ణ" అన్నవార్త వినిగాని విశ్రమించ లేకపోయారు పెరుమాళ్లుగారు. తక్షణం పరుగున వెళ్లి చూడలేకపోయినందుకు కంటతడిపెట్టారు.

"మీరు బాధపడకండీ, వారం రోజుల్లో యింటికివచ్చి-మీచేత మనవణ్ని పెట్టదా?" అంటూ ఓదార్చారు సంతానంగారు.


ఆఫీసుకు వెడుతూనే నరసింహంగారు రాజుకీ శుభవార్త కేబుల్ చేశాడు.

* * *

కేబుల్ అందుకున్న రాజుకి ఎంత ఆనందం కల్గిందో-అంత దుఃఖమూ కల్గింది-కొడుకుపుట్టినందుకు ఆనందం. తనుదగ్గిరవుండి అన్నపూర్ణను ఓదార్చ లేనందుకు దుఃఖం. మామగారిమీద పంతంకొద్దీ ఏడేళ్ల బాండు రాసేదేగాని యిప్పుడు-బాధగావుంది. మాతృదేశపు ఎల్లలు దాటి వెడితే తప్పించి-'దేశం వదిలితేవుండే వంటరితనం తెలిసిరాదు'-అనుకున్నాడు. ఒకటికి పదిసార్లు కేబుల్ చదువుకుని ఆనందించాడు.

* * *

పదిరోజులు కాగానే క్షేమంగా యింటికి వచ్చేసింది అన్నపూర్ణ. బ్రాహ్మణ్ని




పిలిపించి సంప్రోక్షణ చేయించారు పెరుమాళ్లగారు. ఇల్లంతా ఆయనకెంతో నిండుగా కన్పించసాగింది. తాతగారి మంచం పక్కనే చేరింది మనవడి ఊయెల.

అన్నపూర్ణ కిప్పుడు కొత్త వ్యాపకం ఏర్పడింది. నూకాలు సహాయంతో బాబుకి నీళ్లు పోయడం, పాలివ్వడం, చక్కగా దిష్టిచుక్క పెట్టి తాతగారి ఒళ్లో కాస్సేపుంచి–ఊయెలలో పడుకోపెట్టడం. పసివాని ఏడుపుతో ఆ యింట్లో ఎంతో మంది ఎక్కువ అయినట్టయింది. వాడిలోవాడు నిద్రలో నవ్వుకొంటుంటే 'మీ నాన్న చూస్తే ఎంత బాగుండును' అనుకునేది అన్నపూర్ణ.

బాబు చేష్టలు ప్రతీదీ తెగవర్ణిస్తూ రాజుకి ఎంతలేదన్నా రోజుకో ఉత్తరం రాసేది.

ఆ ఉత్తరాలే వారి మధ్య దూరాన్ని విరహాన్ని కొంచెం తగ్గించాయి.

బాబు కోసం చిన్న చిన్న బహుమతులు పార్సెలు చేసేవాడు రాజు.

* * *

ఆ రోజు బాబుకి మూడేళ్ళు నిండుతాయి. ఆ రోజే అనుకోకుండా రాజుదగ్గర నుంచి ఉత్తరం వచ్చింది–బహుశా తను ఓ వారంలో బయలుదేరి రావచ్చనీ–సెలవు మంజూరు అయిందనీ.

అన్నపూర్ణ ఆనందానికిక అంతులేదు.

ఆ రోజు మొదలెట్టి యిల్లంతా శుభ్రంచేయించింది. రాజు - తనూ - ఎంతో ఏకాంతాన్ని ఆనందాన్నీ పంచుకున్న పడకగది చక్కగా అలంకరించింది.

ఆమె మనస్సు రెక్కలు విప్పి ఎప్పుడో రాజుచెంత చేరింది.

కాని, కోరుకున్నప్పుడు కాలంరెక్కలు త్వరగా కదలవు కదా!

ఆ వారం ఓ యుగంలా కదలింది అన్నపూర్ణకి. ఏ ప్లేనుకి వచ్చేదీ కేబుల్ చేస్తాడనీ, యిక తను తన హృదయాధి రాజుని చూసే రోజులు అతి దగ్గిరకి వచ్చేశాయని, అన్నపూర్ణ మనస్సు పురి విప్పి ఆడింది.

'పుట్టిన మూడేళ్లకి చూస్తారురా నిన్ను మీ నాన్న' అంటూ కొడుకుని ముద్దుపెట్టుకొంది.

వాడు బొద్దుగా ముద్దుగా ఉండి చిలకపలుకులు పలుకుతున్నాడు.

తాతగారికి పని ఎక్కువ చేస్తున్నాడు. తల్లికసలు తెరిపేలేకుండా చేస్తున్నాడు!

ఆనందంలో రాజు తప్ప యితర ఆలోచనలు తోచడం లేని అన్నపూర్ణకి మనస్సు కలుక్కుమంది - నూకాలు చెప్పిన వార్తవిని.

"ఆ ముసల్దానికేం పోయికాలం! మనింట అన్నీ పట్టుకెడుతుంది. చూడమ్మా ఏవందో" అంది నూకాలు.

"ఏమందేమిటే?" బాబుకి తల దువ్వుతూ యధాలాపంగా అడిగింది అన్నపూర్ణ.

"మూడేళ్లయి అక్కడే వున్నాడు. ఏ దొరసాన్నో కట్టుకుని వుండడా! అందమ్మా- మన బాబుగా రొస్తున్నారని చెప్తేను!" అని మండిపడింది.

అస్సలిటువంటి ఆలోచనే రాని అన్నపూర్ణ దువ్వెన్ని చేతులో పట్టుకుని అలాగే వుండిపోయింది. మనస్సులో దిగులు గూడుకట్టుకో నారంభించింది.

ఇంతట్లో రంగన్న కేబుల్ పట్టుకువచ్చాడు. రాజుదగ్గిరనుంచే! కాని రాడం లేదనీ, వివరంగా వుత్తరం రాస్తాననీ యిచ్చాడు. అసలే మూల్గుతున్న మనస్సు బావురంది ఆ కేబుల్ చూశాక.

మేడమీద తన గదిలోకి వెళ్లిపోయింది అన్నపూర్ణ. మంచంమీద బోర్ల పడి వెక్కి వెక్కి ఏడ్చింది. ఎప్పుడు మెల్లిగా ఎక్కివచ్చాడో బాబు వచ్చి తల్లి దగ్గిరకి చేరాడు 'అమ్మా! అమ్మా!' అంటూ.

బాబుని గుండెల కద్దుకుని బాధపడింది అన్నపూర్ణ.

"మూడేళ్ల కయినా నిన్ను చూస్తారని ఆశపడ్డానురా. నా ఆశ నిరాశ అయిపోయింది!" అనుకుంది.

నూకాలు వచ్చి 'పెద్దబాబుగారు పిలుస్తావున్నా రమ్మగారూ,' అంటూ పిల్చింది.

అమ్మాయిగారి ఉబ్బి ఎఱ్ఱపడిన కళ్లు చూసి 'ఆ ముసల్దాని మాట పట్టుకొని బాధపడకండి. బాబుగారొస్తారు. మీరే చూస్తారుగా!' అంది.

"బాబుగారు రాడం లేదే నూకాలూ," అంది ఒణుకుతున్న కంఠంతో.

"ఇప్పుడు త్తరం వచ్చింది కదమ్మాయిగారు." నమ్మలేనట్టు బుగ్గలు నొక్కుకుంది నూకాలు.

"ఉత్తరం రాస్తానన్నారు." అంటూ క్రిందికి దిగింది అన్నపూర్ణ.

మంచంమీద కూర్చుని కూతురి రాకకోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. కూతురు మెట్లమీద కనబడగానే "ఏం రాశాడమ్మా రాజు? ఏ రోజు వస్తున్నాట్ట?"

"రావడంలేదట నాన్నా. ఉత్తరం రాస్తానని రాశారు" అంది జాపిన తండ్రి చేతుల్లోకి బాబుని అందిస్తూ.

"అదేమమ్మా!" ఏమనాలో తెలియక అన్నారు.

"ఏదో అవాంతరం వచ్చివుంటుంది. రాస్తానన్నారుగా." అని వంటింటి కేసి నడిచింది అన్నపూర్ణ- ఏదైనా పనిలో తన నిరుత్సాహాన్ని మరిచిపోదామని.

* * *

రాజుదగ్గిరనుంచి ఓ వారం పదిరోజులు దాటే దాకా ఉత్తరం కూడా రాలేదు అన్నపూర్ణ మనస్సులో బాధ పైకి చెప్పుకుందుకు కూడ లేదు.

అసలే తనవల్ల యిలా విడిపోయారని బాధపడుతున్న తండ్రి. ఏమీ ఎరుగని పసివాడు కొడుకు. ఇద్దరికోసమేనా - లేని వుత్సాహాన్ని తెచ్చుకుని తిరగాలని నిశ్చయించుకుంది.

ఆ రోజు ఉత్తరం వచ్చింది- అదరే గుండెలతో దాన్ని అందుకుని మేడ మీదికి వెళ్లిపోయింది. చాలా పెద్ద ఉత్తరం రాశాడు రాజు.

"నా స్థానంలో వచ్చి నా సెలవులో పనిచేయవలసిన అతగాడు ప్రమాదంలో చిక్కుకున్నాడు. అంచేత నన్ను సెలవు వెనక్కి తీసుకోమన్నారు... ఎంతో ఆశతో ఎదురు చూసినది కాస్తా నీటి బుడగలాగ పేలిపోయింది అన్నపూర్ణా. యిక మన బాబు నన్ను గుర్తు కూడా పట్టలేనప్పుడు గాని నేను రాలేనేమో!" అంటూ తన మనస్సులోని బాధనంతా వెళ్లబోసుకున్నాడు కాగితాలమీద.

తనపై అనురాగం కొంచెం కూడా తగ్గని రాజుని తలచుకుని అతని ఉత్త

రాన్ని పెదవులకు హత్తుకుంది అన్నపూర్ణ. 'పాపం నే నిక్క డెంత బాధ పడ్డానో అంతకు వేయిరెట్లు వారు బాధ పడుతున్నారు.' అనుకుంది అన్నపూర్ణ.

"ఇక మళ్లీ మూడేళ్లు ఎదురుచూస్తూ గడపాలి కాబోలు!" అన్న ఊహ వచ్చినప్పుడల్లా నిరుత్సాహం ముంచెత్తేది అన్నపూర్ణని.

ధైర్యం చిక్కపట్టుకుని తండ్రిని, కొడుకుని చూసుకొంటూ గడపవలసిన ఏకాంతం, ఒంటరితనం - క్షణాలుగా గడిచిపోదా, అని తలపోసింది - అన్నపూర్ణ బేలహృదయం. కాలం జరగను, పెరుమాళ్లగారి కాలునయిం అయిందే గాని ఆరోగ్యం క్షీణించడం మొదలుపెట్టింది. ఆయన తరుచు గుండెపోటు రావడం, తగ్గడంలో- మంచం పట్టేశారు.

ఆరో సంవత్సరంలో అడుగుపెట్టాడు బాబు. రోజూ స్కూలుకి అన్నపూర్ణే తీసుకువెళ్లి తీసుకువచ్చేది.

ఇప్పుడు బాబు ఆమెకు సర్వస్వం.

వాడింట్లో లేని క్షణాలు గడవడం కష్టమైందామెకి. ఉదయం లేచింది మొదల - రాత్రి తన మీద ఓ కాలూ చెయ్యీ వేసుకొని కథ వింటూ పడుకునే దాకా వాడి పనే. వాడి ధ్యాసే.

రాజు దగ్గిర లేకపోవడం, తండ్రి పని అంతా జాగ్రత్తగా చూసుకుందుకు నర్సు కావలసి రావడంతో - అన్నపూర్ణకి బాబు తప్పించిన లోకం లేకుండా పోయింది.


వాడి అల్లరి, వాడి చిలిపి కబుర్లు, వాడి ఆటపాటలు - అన్నీ ఆమెను తన మనస్సులోని బాధ మరిచిపోయేలా చేస్తున్నాయి.

వాడే లోకం - వాడే బ్రతుకుగా తయారైంది అన్నపూర్ణ.

* * *

అన్నపూర్ణకి కొంచెం జ్వరం వచ్చినట్టుగా వుండి కుర్చీలో చేరబడికూర్చుంది. బాబు ఆత్రంగా తల్లి నుదురు పట్టి చూశాడు "ఏమ్మా, వెచ్చగావుంది? జ్వరం వచ్చింది పడుకో" అంటూ బలవంతాన తల్లిని కుర్చీలోంచి లేవదీసి మంచం మీద పడుకోపెట్టి దుప్పటి కప్పాడు. డ్రాయరులాగి థర్మామీటరు తెచ్చి, యిటు కావని అటు, అటు కాదనిటు తల్లినోట్లో పెట్టి జ్వరం చూడాలని ప్రయత్నించాడు.

రాత్రికిక అన్నపూర్ణకి బాగా జ్వరం ఎక్కువ అయింది. నీకు పక్కగదిలో




పక్కవేసింది బాబూ, అక్కడ పడుకో, నీకూ ఆయివస్తుంది నాదగ్గిర పడుకుంటే నని ఎంత చెప్పినా - మొండికెత్తి చివరికి తల్లిని కౌగలించుకునే పడుకున్నాడు బాబు.

'మరీ అంత ముద్దు చేయకండమ్మా, తరవాత కష్టం' అంటూ ఇద్దరికీ కలిపి దుప్పటి కప్పి లైటు ఆర్పి వెళ్ళిపోయింది నూకాలు.

అంత జ్వరంతోటీ కథ చెప్తేగాని కన్నుమూసి నిద్రకి ఒరగలేదు బాబు.

* * * *

తనెలాగా రాడానికి వీలుపడదు కనుక మామగారికి తగిన ఏర్పాట్లన్నీ చేసి బయలుదేరి వచ్చేయమని రాశాడు రాజు.

నిజానికి అన్నపూర్ణకి కూడా అలా అనిపించకపోలేదు ఒక్కొక్కసారి. అన్నీ జాగ్రత్తగా శ్రద్ధగా చూసుకునే నరసింహంగారున్నారు. ఇంట్లో అటూ యిటూ కావలిస్తే కనిపెట్టడానికి సంతానంగారున్నారు. కాని డాక్టరుగారు మటుకు 'యీ పరిస్థితిలో వారికి మీరు దూరంగా వుండడం భావ్యంకాదని' హెచ్చరించ డంతో ఆ వూహకి స్వస్తిచెప్పింది అన్నపూర్ణ.

భర్తకి వివరంగా ఉత్తరం రాసింది.

మళ్ళీ ఎప్పటిలాగే వారి సంసారం పోస్టుసంసారంగా మారిపోయింది.

* * * *

బాబుమటుకు రోజు రోజుకీ పెరుగుతూ - అన్నపూర్ణ కళ్ళకే కొత్తగా కన్పించుతూన్నాడు. వాడికి ఐదేళ్లు నిండి ఆరోఏడు కూడా నడుస్తూంది. వాడికి తండ్రి వున్నాడని తెలుసు. కాని ఎలావుంటాడో ఫొటోల్లోనే చూశాడు. అమ్మ మంచంపక్క బల్లమీదున్న బొమ్మ నాన్ననే చూశాడు అంచేత తండ్రి దగ్గిరుంటే ఎలా వుంటుందన్నది వాడికి తెలియదు.

ఛాన్సు దొరికినప్పుడల్లా నరసింహంగారి రఘు, సంతానంగారి రాము వాడికి చెప్తూండేవారు.

ఆరోజింకా కారు రాక స్కూలు కాంపౌండులో నిలబడివున్నాడు బాబు.

రఘు రాము వెళ్ళిపోతూ, 'రారా మేంకూడా వుంటాంగా యింట్లో దింపేస్తాం' అని పిలిచారు.

'వుహు అమ్మ అలా వెళ్ళకూడదంది' అన్నాడు బాబు.

"ఈ గొప్పంతా నాన్న యింటి కొచ్చేదాకానేరా బాబూ, మీ నాన్నగారింటి కొస్తే యింక నిన్ను పట్టించుకోదు మీ అమ్మ'' అన్నాడు రాము.

''మా అమ్మ అలాంటిది కాదు." అన్నాడు కోపంగా బాబు.

"మీ అమ్మే కాదురా, ఎవరి అమ్మలేనా అంతే. మా అమ్మచూడు - ఎప్పుడు చూసినా నాన్నగారు కోప్పడతారు నాన్న తిడతారు, అంటూనే వుంటుంది. తను అనుకోనిదేంచేసినాసరే మా నాన్న వీపు చీరేస్తాడు. నాకూ బేబీకీ నాన్నకంటే ఆ గోడకి వేళ్ళాడే కొరడా అంటే భయం," అన్నాడు రఘు.

"మా అమ్మ అలాకాదు ఎప్పుడూ యింటికి రాకుండా ఏం అడక్కుండా వుంటే హాయిగా వుంటుంది. మేం ఎదురైతే చాలు నాన్నముఖం చిటపట లాడుతుంది. మా నాయినమ్మే నయం - అటు అమ్మనీ యిటు నాన్ననీ సాధిస్తుంది. ఎప్పుడేనా బేవా అర్ధా దొంగిలించినా కోప్పడదు" అన్నాడు గర్వంగా రాము.

"మీరు ఛొండి. మా అమ్మ అలాకాదు. మా నాన్న కాదు" అన్నాడు వస్తూన్న దుఃఖాన్ని ఆపుకొందుకు విశ్వప్రయత్నం చేశాడు బాబు. నిజంగా నాన్నలు అంత భయంకరంగా వుంటారా ?అన్న అనుమానం తలెత్తింది వాడిలో.

'పోరా నీకే తెలుస్తుంది మీ నాన్న వచ్చాక ! మీ అమ్మ మేడమెట్లు కూడా ఎక్కనివ్వదు !" వెక్కిరించి 'రారా పోదాం' అంటూ యిద్దరూ కలిసి వెళ్ళిపోయారు.

దిగాలుపడిపోయాడు బాబు.

అమ్మని అడిగితే ? అమ్మ ఎప్పుడూ నాన్నగారొస్తే ఎంత బాగుంటుందో అనే చెప్తుందేం ?' అనుకుంటూ పరధ్యానంగా అలాగే నిలబడ్డాడు.

రంగన్న కారుదిగి 'ఎక్కడ చూస్తున్నారు బాబుగారూ, రండి అమ్మగారు అర్జెంటుగా తీసుకురమ్మన్నారు.' అని కారుతలుపు తెరచాడు.

కారెక్కి కూర్చుంటూ 'అమ్మెందుకు రాలేదు ?' అడిగాడు బాబు.

రంగన్న చాలా హుషారుగా వున్నాడు

"మీకు యింకా తెలీదు బాబూ, రేపు మధ్యాహ్నాని కల్లా నాన్నగారొస్తున్నారంట అమ్మగారిల్లు సిద్ధంచేస్తున్నారు" అన్నాడు.

"నాన్నగారా ?"

"అవును బాబూ. చెప్పాపెట్టకుండా వచ్చేస్తున్నారు.అమ్మగారెంత ఆనందంగా వున్నారనీ..." రంగన్న చెప్పుకుపోతున్నాడే గాని బాబుకి ఏమీ వినబడ్డంలేదు. "నాన్నగారొచ్చేస్తున్నారు" అదొక్కటే వాడి చిన్నబుర్రలో సుళ్ళు తిరుగుతూంది.

నాన్నగారెలా వుంటారు ? రఘు నాన్నలా కొడతారా ? రాము నాన్నలా కళ్ళ పడకుండా వుండే చాలంటారా ? అమ్మ యిక నన్ను పట్టించుకోదా ? అనే ఆలోచనలతో ఇంటిదగ్గిర కారు దిగాడు.

అక్కడకి కూడా అమ్మ వచ్చావా బాబూ అంటూ ఎదురురాలేదు. సరికదా నూకాలొచ్చి - వచ్చేశారా బాబూ, రండి రండి స్నానంచేసి టిఫిన్ తినేద్దురుగాని అంటూ హడావిడి పెట్టింది.

బాబుకి ఒళ్ళు మండింది. 'అమ్మేది ?' గట్టిగా అడిగాడు

'కంపెనీ కెళ్ళారు బాబూ, నరసింహంగారికి ఏదో చెప్పాలని. వచ్చేస్తారు-నువ్వు రా' అంటూ చేయి పట్టుకుంది. గట్టిగా చేయి విదిలించాడు. చేతిలోవున్న పుస్తకాల పెట్టె హాల్లో మూలకి విసిరికొట్టాడు.

పక్కగదిలో మంచంలో ఉన్న తాతగారు, "బాబూ, నాన్నా, యిలారా," అంటూ ప్రేమగా కేకవేసినా వినిపించుకోకుండా మెట్లెక్కి అమ్మగదిలోకి వెళ్ళి తలుపులు వేసేసుకున్నాడు.

నూకాలు పరుగున మెట్లెక్కుతూ, 'బాబూ, నా బంగారు కదూ, తలుపులు తియ్యి' అని గొంతురాసుకు పోయేదాకా బ్రతిమాలింది.

కాని బాబు తలుపు తెరవలేదు.

అప్పుడే లోపలికి వస్తూ అన్నపూర్ణ "ఏమిటే నూకాలూ ఏమైంది ?" అంటూ తండ్రి గదికేసి నడిచింది.

"బాబుగారికి కోపం వచ్చిందమ్మా. పోయి తలుపులు వేసుకున్నారు. ఎంత బ్రతిమలాడినా తీయడంలేదు" అంది.

"నాన్నా నరసింహంగారికి చెప్పాను. రేపు మధ్యాహ్నం ఆయనా ఎయిర్ పోర్టుకి వస్తానన్నారు. నేవెళ్ళి బాబుని సముదాయించి వస్తా'' నంటూ గబ గబ మెట్లెక్కింది. తలుపు దగ్గిరగా నోరుపెట్టి "బాబూ, నే వచ్చేశానుగా, తలుపు తెరు.'' అంది ముద్దుగా.

"నే తెరవను ఫో, నువ్వెందుకు రాలేదు నాకోసం? రంగన్ననెందుకు పంపావు? నువ్వెందుకు లేవుయింట్లో?"

అప్పటికే బాబుకి ఏడుపుస్వరం వచ్చేస్తూంది.

తలుపుకి యివతలవున్న అన్నపూర్ణ నవ్వుకుంది.

"పని ఉంది బాబూ. వెళ్ళి అదికాస్తా చేసేసి నీకోసం వచ్చేశాను. యింక నువ్వూ నేనూ బజారుకెళ్ళి కావలసినవి ఎన్నోవున్నాయి. కొనుక్కొద్దాం. నాన్నగా రొస్తున్నారా? రేపు గొప్పగా పూలహారాలు వేసి ఆహ్వానించి తీసుకురావద్దూ?" గొప్పగా చెప్పింది అన్నపూర్ణ.

"నాకు నాన్నొద్దు. నువ్వే కావాలి.'' అన్నాడు బాబు.

"తప్పమ్మా, అలా అనకూడదు. ఎన్నాళ్ళకివస్తున్నారో నాన్నగారు తెలుసా? అస్సలు నిన్ను ఫోటోలోతప్పించి చూళ్ళేదు. ఎంత ఆత్రంగా వస్తారో తెలుసా?" వివరించి చెప్పాలని చూసింది.

"వద్దు వద్దూ వద్దు. నాన్న ఒద్దు. పొమ్మను." అంటూ లోపల్నుంచి తలుపు కేసి సామాన్లు విసరడం ప్రారంభించాడు.

అన్నపూర్ణ నిస్సహాయంగా "బాబూ తప్పు. ముందు తలుపుతెరు." అంది గట్టిగా.

బాబు తలుపు తెరవడం. మంచంపక్క బల్లమీదున్న తండ్రిఫొటో అమాంతం విసరడం, అది గదిదాటి మెట్ల దగ్గిరపడి ముక్కలవడం ఒక్కసారి జరిగి పోయింది.

అంతే. అన్నపూర్ణ ఓర్పుకూడా ఆ సంఘటనతో నశించింది. బాబు రెక్క పట్టుకుని ఆ చంపా యీ చెంపా తెగ వాయించింది. నూకాలు అడ్డుపడి బాబుని లాక్కోకపోతే – పిచ్చిఎత్తినట్టు యింకా కొట్టేసేదే అన్నపూర్ణ. వాడి మొండి తనానికి అంత కోపం వచ్చింది.



రాత్రిదాకా బాబు తల్లి చుట్టుపక్కలకి రాలేదు. రాత్రి తన పడక అమ్మగది పక్కగదిలోకి మార్చడం చూశాడు. వాడికి ఎక్కడలేని దుఃఖం వచ్చింది. పడుకున్నట్టే పడుకుని అర్ధరాత్రి అమ్మా అని ఏడుస్తూ తల్లిపక్క చేరాడు. అమాంతం కొడుకుని కౌగలించుకొని 'పాపిష్ఠిదాన్ని నిన్ను కొట్టాను కదూ.' అంటూ కంటతడిపెట్టుకుంది.

తల్లిమీద ఓ కాలూ ఓ చేయీ పడేసుకుని పడుకుని వెక్కుతున్నాడు బాబు.

"నువ్వలా చేయకూడదమ్మా, నాన్నగారేమనుకుంటారు చెప్పు. బాబునిలా పెంచావేమిటని నన్ను కోప్పడరూ? నాన్నగారి దగ్గిర ఎంతో మర్యాదగా భయ భక్తులతో వుండాలిగాని యిలా మంకుగా వుంటారా?" బుజ్జగిస్తూ బుద్ధులు చెప్పింది.

"అమ్మా, నాన్నగారొస్తే కొడతారా?" అమాయికంగా అడిగాడు బాబు.

"ఎందుకు కొడతారు బాబూ, అల్లరిచేస్తే కోప్పడతారు. నాన్నగారు మంచి మనిషి. నువ్వంటే ఎంతో యిష్టం."

"మరి రఘు అలా చెప్పాడమ్మా" అమాయకంగా తన భయాన్ని బయట పెట్టాడు బాబు.

"పిచ్చినాన్నా, మీ నాన్న. రఘువాళ్ళ నాన్నగారి వంటివారు కారోయ్," అంటూ వాడి నుదుటిమీద ముద్దుపెట్టుకుంది.

అప్పటికి అలసిపోయిన బాబు పడుకుని నిద్రకి ఒరిగాడు.

* * * *

ఉదయం లేచిందిమొదలు యింట్లో ఒకటే హడావిడి. బాబులేచి చూసేసరికి అన్నపూర్ణ తమగది చక్కగా తీర్చిదిద్దుతోంది. తనని లేపనేనా లేపకుండా హాయిగా వున్న తల్లిని చూస్తే — ఆ రాబోయే తండ్రిని తలచుకుంటే మళ్ళీ కోపం వచ్చింది బాబుకి.

విసురుగా కిందికి వెళ్ళిపోయి తనపని తనే చేసుకోడం మొదలుపెట్టాడు. నూకాలు నీళ్ళు పోస్తానంటే తోసిపారేశాడు. వాడి కోపానికి నవ్వుకుంటూ 'ఇక నాన్నగారు రానీ, నీ పని చెప్తాను' అంది వేళాకోళంగా.

'నువ్వు ఫో' అంటూ దాన్ని యింట్లోకి తరిమాడు.

ఉదయం టిఫినుదగ్గిర, మధ్యాహ్నం భోజనాలదగ్గిర యింక అస్తమానూ ఆ రాబోయే నాన్నగురించిన కబుర్లే వింటూంటే ఒళ్ళు మండిపోయింది బాబుకి. చివరికి ఏరోడ్రోముకి వెళ్ళే ఓయిమయింది. అప్పటిదాకా అమ్మ అలంకరించు కుంటూనే వుంటే చికాకువేసింది బాబుకి.

కారులో బయలుదేరి ఎయిర్‌పోర్టు చేరారు.

ప్లేను దిగుతోందని చెప్పగానే అన్నపూర్ణ కాలు యిక నిలువలేదు.

'బాబూ నాన్నగారికి ముద్దుపెట్టాలి తెలుసా?' అంటూ ఒందోసారి హెచ్చరించింది.

ఏరోప్లేనులోంచి జనం దిగుతున్నారు.

సూటులో, చేతిలో చిన్న బ్రీఫ్‌కేసుతో దిగుతున్న ఒకాయన్ని చూపి 'అదిగో నాన్నగారు. చెయ్యివూపు" అంటూ ఆనందంగా తను చెయ్యి వూపడం ప్రారంభించింది.

బాబు బదులుచెప్పకుండా వూపుతున్నాడు.

దిగినవాళ్ళు యింకో దారిగుండా లోపలికెళ్ళి వస్తున్నారు. అటు పరుగెత్తింది అన్నపూర్ణ.

నరసింహంగారు, సంతానంగారు, దండలు పట్టుకుని అటు పరుగెత్తారు.

"పూర్ణా !" అంటూ అమాంతం రాజు అన్నపూర్ణని కౌగలించుకున్నాడు.

"ఏడీ బాబు ?" ఆత్రంగా అడిగాడు.

దూరంగా ఏమీ పట్టనట్టు నిలబడ్డాడు బాబు.

'రా, బాబూ, నాన్నగారు' అంటూ జబ్బపట్టుకు లాక్కొచ్చింది అన్నపూర్ణ.

వంగి బాబు చెంపమీద ముద్దుపెట్టుకొన్నాడు రాజు.

చేతితో గట్టిగా బుగ్గ తుడిచేసుకున్నాడు బాబు.

అన్నపూర్ణా రాజుకూడా వాడి చేష్టకి నవ్వుకున్నారు. ఆనందంగా అంతా యిల్లు చేరారు.

* * * *

రాజు వచ్చింది మొదలు అన్నపూర్ణకిక తెరిపిలేదు. చిరకాలపు ఎడబాటు తరువాత కలుసుకున్న వారికిక తనివితీరదు. బాబుకి మటుకు తండ్రి రాక చాలా విసుగనిపించింది.

"అమ్మెందుకు స్కూలుకి తీసుకెళ్ళదు ?"

"నాన్నొచ్చారుగా !"

"అమ్మెందుకు నీళ్ళు పొయ్యదు ?"

"నాన్నగారున్నారుగా !"

"అమ్మెందుకు నాదగ్గిర పడుకోదు ?"

"పో పోకిరీ" అని నవ్వేసింది నూకాలు

"అవును. కొత్తగా వచ్చాడుగా నాన్న. అతన్నే విడిగాపడుకోమను" అంటూ, ఆ రాత్రి తల్లికే చెప్పేశాడు బాబు.

వాడి అమాయకత్వానికి నవ్వుకుంది అన్నపూర్ణ. వాడిదగ్గిరే పడుకుని నిద్ర జోకొట్టింది. వాడు నిద్రపోనిచ్చి తన పడకగది చేరింది.

"ఇంక రావనుకున్నాను!'' అంటూ లోపలికి వస్తూన్న అన్నపూర్ణని కౌగిట చేర్చుకున్నాడు రాజు.

కొడుకు ముచ్చటలు చెప్పింది. 'వాడికి మీమీద చాలా కోపంగా వుంది.'

రాజు అన్నపూర్ణవడిలో తలపెట్టుకుని కబుర్లు చెప్తున్నాడు. అతని క్రాపు సవరిస్తూ ఈ లోకాన్నే మరిచిపోయింది అన్నపూర్ణ.

* * * *

బాబు నిద్రలేచాడు. తల్లి తనపక్కలేదు. చుట్టూ చూశాడు. అమ్మలేదు. లేచి తిన్నగా అమ్మ తనూ పడుకునేగది దగ్గిరికి వెళ్ళాడు. తలుపులు వేసివున్నాయి. చిన్నదీపపు వెల్గులు కొంచెంగా తెరుస్తున్నాయి.

బాబు తలుపు తాళం కన్నందగ్గిర కన్నుపెట్టి లోపలికి చూశాడు.

తల్లివడిలో తలపెట్టుకు పడుకునివున్న నాన్న కన్పిస్తున్నాడు. తననిలా వదిలేసి తండ్రిని లాలిస్తున్న తల్లిమీద చాలాకోపం వచ్చింది బాబుకి. దుఃఖంతో పెదవులు ఒణికాయి. కోపంగా తలుపు గట్టిగా బాదాడు.

రాజు లేచి తలుపు తెరచాడు.

'బాబూ నిద్ర రాలేదూ?' అంటూ పల్కరిస్తున్న తండ్రికేసైనా చూడకుండా తిన్నగా లోపలికి వెళ్ళి మంచంమీద పడుకున్నాడు. తల్లిమీద ఓ కాలూచెయ్యీ పడేశాడు.

పక్కనేవున్న వాలుకుర్చీలో పడుకుని సిగరెట్టు ముట్టించాడు రాజు.

తెల్లవారుతుంటే అన్నపూర్ణ లేచింది. కుర్చీలో పడుకున్న భర్త దగ్గిరకి వెళ్ళింది. రాజామెని దగ్గిరగా లాక్కున్నాడు.

"తెల్లవారింది. వదలండి, కిందికి వెళ్లి తలుపులు తెరవాలి" అంది నెమ్మదిగా.

"నేను వదలను పూర్ణా, ఏమిటి వీడిలా తయారయ్యాడు? విడిగా పడుకోబెట్టడం అదీ అలవాటు చేయలేదు?" అడిగాడు రాజు.


ఒంటి కంటితో యిదంతా గమనిస్తున్నాడు బాబు. వాడికి తండ్రిమీద కోపం వచ్చింది.

'మా అమ్మని వదులు' అని గదమాయించాడు.

కొడుకు మేలుకునే వున్నాడని గ్రహించిన రాజు అన్నపూర్ణని వదిలాడు.

మారు మాటాడకుండా కిందికి పరుగెత్తింది, అన్నపూర్ణ.

* * *




ఆ రోజంతా హాయిగా బయట గడపాలని నిశ్చయించుకున్నారు దంపతులు

పిక్నిక్ లంచ్ సర్దింది అన్నపూర్ణ.

'బాబుకి సరిగ్గా టైముకి అన్నం పట్టుకెళ్లు. సాయంత్రం వచ్చేస్తాం' అంటూ భర్తతో బయలుదేరింది హుషారుగా.

మధ్యాహ్నం అన్నం నూకాలు తేడం దూరంనుంచ్చే చూశాడు బాబు.

అన్నం తిననని మారాంచేశాడు.

'నాన్నగారిలా చేశావని తెలుస్తే కోపం చేసుకుంటారు తినెయ్' అంటు కబుర్లు చెపూ ఎలాగో తినిపించింది.

'ఈ నాన్నొచ్చాక నన్ను చూడ్డంలేదు అమ్మ' అన్నాడు బాబు.

"ఎన్నాళ్లకో వచ్చారుకదు బాబూ నాన్నగారు", అంది నూకాలు.

"అయితే మళ్లీ పోతారా? ఎప్పుడు?" ఆత్రంగా అడిగాడు బాబు.

"తప్పు, అలా అనకూడదు," అంది నూకాలు.

ఇంట్లోకొచ్చి, పెరుమాళ్ళు గారికీ కబుర్లన్నీ చెప్పింది నూకాలు.

సాయంత్రం యింటికి వచ్చాక ఒక్క మాటకూడా మాట్లాడకుండా పైకి వెళ్లిపోయాడు బాబు.

'నూకాలూ, బాబేడీ?' పెరుమాళ్ళు గారు కేకవేశాడు.

"పైనున్నారు బాబూ," అంది నవ్వుతూ! "చిన్న బాబుకి కోపం ఎక్కువ," అంది.

పెరుమాళ్ళుగారు నవ్వుకున్నారు.

*　　　*　　　*

మేడమీద బాబు తండ్రి సామానులన్నీ లాగి బయట పారేశాడు. ఆయనగారి షేవింగ్ సెట్టులోంచి ఓ బ్లేడు తీసి నాన్నగారి షర్టులూ పాంటులూ చీలికలు వాలికలు చేశాడు. వాడి కసి తీరడం లేదు.

'నీమూలాన్నే అమ్మ నాతో మాట్లాడంలేదు. నువ్వుపో' అంటూ కసిగా కోసేస్తున్నాడు.

అప్పుడే అతి ఉత్సాహంగా నవ్వుకుంటూ చేయీ చేయీ పట్టుకుని లోపలికి వచ్చారు రాజూ అన్నపూర్ణా.

మామగారి గదిలోకి వెళ్లాడు రాజు.

'దాన్లో ఐస్‌క్రీముంది బాబుకి యియ్యవే నూకాలు' అని కేకేసి వంటగదికేసి నడచింది అన్నపూర్ణ.

నూకాలు ఐస్‌క్రీము పైకిపట్టుకెళ్ళింది.

అది అందుకుని మేడమీదనుంచి కిందికి విసిరికొట్టాడు బాబు.

బాబు చేసిన పని చూసి కళ్లప్పగించింది నూకాలు. గదిలో అన్నీ చిందర వందరగా పడివున్నాయి.

"ఏమిటి బాబుకి కోపం వచ్చిందా" అంటూ మేడమీదికి వస్తూన్న అన్నపూర్ణ కళ్లను పడకగదిపడింది. బాబు చేసిన పనికి అదిరిపడింది.

తల్లిని చూసి గోలగా కాళ్ళూ చేతులూ నేలకేసిబాదుకుంటూ 'పొమ్మను - యీ నాన్నని. వెళ్ళి పొమ్మను' అంటూ ఏడుస్తున్నాడు బాబు.

అన్నపూర్ణ కా క్షణంలో ఎక్కడలేని కోపం అసహ్యం కల్గాయి కొడుకు మీద.

వాడి జబ్బ పట్టుకొని ఒక్క చెంపకాయి వేసింది 'ఏం మాటలివి? ఏం పనులివి?' అంటూ తిట్టింది.

పిచ్చెక్కిన వాడిలా పొమ్మను అనడం తప్పించి కొంచెం కూడా మెత్త పడలేదు బాబు.

"నువ్వే పో వెధవా, ఏమిటామొండితనం? ఏమిటీపనులు? ఛా నువ్వు నాకు

కనిపించకు." అంటూ వాడినలాగే వదిలి వస్తూన్న దుఃఖాన్ని ఆపుకుంటూ కిందికి వెళ్ళిపోయింది అన్నపూర్ణ.

*　　　*　　　*

బాగా చీకటి పడిపోయింది.

నూకాలు అన్నపూర్ణ కలిసి, బాబు నానా ఖండాలంగా చేసినగది సర్దారు.

అన్నపూర్ణ కొడుకుతో అస్సలు మాట్లాడలేదు. నూకాలే వాడిని వాడిగదిలో పడుకోపెట్టింది.

అన్నపూర్ణ మానసికంగా శారీరకంగా అలసిపోయి తన గది తలుపు గడియ పెట్టి భర్త కౌగిట వాలింది.

*　　　*　　　*

అమ్మకి నిజంగా కోపం వచ్చింది. తను వెళ్ళిపోయి తిరిగివస్తే నాన్నని ప్రేమించినట్టే తననీ అమితంగా ప్రేమిస్తుందని నిశ్చయించుకున్నాడు. వాడి పసి మనస్సులో అంతకుమించిన ఆలోచన తట్టలేదు. రాత్రి యిల్లు నిశ్శబ్దంలో మునిగినప్పుడు - నెమ్మదిగా లేచాడు. చప్పుడు చేయకుండా యిల్లు దాటి బయటపడ్డాడు.

వాడి కెటు పోవాలో తెలియలేదు.

తిన్నగా నడవడం ప్రారంభించాడు.

చీకటి వాడికి కొత్త.

వెన్నులోంచి ఒణుకు పుట్టుకొస్తూంది.

పరుగు లంకించుకున్నాడు.

రైలు పట్టాల వెంట పరుగెత్తాడు. చాలా పెట్టెలు పట్టాలమీద అక్కడా అక్కడా కన్పించాయి.

ఒక్క దాన్లో ఎక్కి కూర్చున్నాడు.

కాస్సేపటికి వాడికి నిద్ర ముంచుకొచ్చింది.

హాయిగా సీటుమీద పడుకొన్నాడు.

ఇంజనొకటొచ్చి ఆ రైలు పెట్టెని స్టేషనులో ఉన్న రైలుకి తగిలించింది.

రైలు కూతవేసి స్టేషను దాటింది.

రైలు గాడుపుకి యింకా హాయిగా నిద్రపోయాడు బాబు.

*　　　*　　　*

భర్త కౌగిలి విడిపించుకుని కొడుకెలా వున్నాడో ఓ సారి చూద్దామని వాడి గదికేసి వెళ్ళింది అన్నపూర్ణ. గది ఖాళీగా వుంది.

'బాబూ,' అంటూ కిందికి దిగింది - తాతగారి దగ్గిరగాని పడుకున్నాడేమోనని.

అక్కడా లేడు.

'బాబూ, బాబూ' అంటూ యిల్లంతా తిరిగింది. ఎక్కడా లేడు బాబు.

అంతా లేచారు అన్నపూర్ణ కేకలకి.

'బాబు లేడండీ' అంటూ బావురుమంది అన్నపూర్ణ.

'వూరుకో. కోపం వచ్చింది కదూ, ఎక్కడో దాక్కుని వుంటాడు' అంటూ రంగన్నని లేపాడు రాజు.

అంతా అన్నీ వైపులకీ పరుగెత్తారు.

తెల తెలవారుతూండగానే రాజు పోలీసు స్టేషనులోకి నడిచాడు. కూడా అన్నపూర్ణ వుంది. ఏడ్చి ఏడ్చి ఆమె కళ్ళు వాచిపోయాయి.

ఇన్‌స్పెక్టరు రావుగారు వివరాలన్నీ తెలుసుకున్నారు.

'మీరేం ఖంగారు పడకండి, ఎటో పారిపోయి వుంటాడు. మేం సాయంత్రం లోగా పట్టుకొస్తాంగా' అని ధైర్యం చెప్పారు.

"ఏమిటో ఇన్‌స్పెక్టర్, పిల్లలిలా ఎందుకు చేస్తారో అర్థంకాదు: చల్లని నీడ వదిలి యిలా ఎందుకు పారిపోవాలి?' సగం స్వగతంగా అన్నాడు రాజు.

"పిల్లలు పారిపోయాక గాని, తాము వారి మంచికీ చెడుకీ కూడా బాధ్యులం అని తెలుసుకోరు పెద్దలు. మా ఫైళ్ళు చూడండి. పిల్లవాడు కనబడ్డంలేదనీ ఆచూకీ తీయమనీ అడుగుతారు. ఎందుకు పారిపోయాడు? అని ఆరాతీస్తే పెద్దలు చెప్పే కారణాలు, చెప్పని నిజాలు మిమ్మల్ని ఆశ్చర్యపర్చవచ్చు. క్రమశిక్షణ పేరిట కొట్టి చంపేవాళ్ళు, తమ కోప తాపాలను పిల్లలమీద తీర్చుకునేవాళ్ళు, అతిగా ప్రేమించి, మళ్ళీ అంత నిర్లక్ష్యంగా చూసేవాళ్ళు- మీరసలు నమ్మలేరుసార్", ఫొటోలు పత్రికలకి కూడా పంపమనీ ఏమాత్రం న్యూస్ తెలిసినా ఫోను చేస్తాననీ, ధైర్యంగా వుండమనీ చెప్పి రాజుని, అన్నపూర్ణని సాగనంపాడు యినస్పెక్టరు.

*　　　　*　　　　*

ఓ పెద్ద స్టేషనులో గట్టిగా కూతవేసి రైలు ఆగింది. ఉలిక్కిపడి లేచాడు బాబు. పెట్టెనిండాజనం, భయపడుతూ రైలు దిగాడు. అంతా గుంపుగా ఓ పక్క నడుస్తూంటే తను అటు వెళ్లాడు. వారి మధ్యలోంచి గేటుదాటి బయటపడ్డాడు.

## పేదరికం భరించలేక కుటుంబం ఆత్మహత్య

గుజరాత్‌లో దారిద్ర్య బాధతో వంద మంది హరిజన స్త్రీల ఆత్మాహుతి

విజయవాడవద్ద సంఘటన:

పేదరికాన్ని భరించలేక ఏడుగురు సభ్యులు కల కుటుంబం ... యాపత్తూ నిన్న రాత్రి ఇక్కడ దుర్గాఘాట్ వద్ద కృష్ణా ...

గాంధీనగర్, మే ... దారిద్ర్యబాధతో ... వంద మంది హరిజన ... ఆత్మాహుతి చేసుకొన్నా...




చుట్టూ అంతా కొత్తగావుంది.

భయం భయంగా వుంది.

ఏం చేయాలో తోచలేదు.

బాగా ఆకలిగా కూడా వుంది. ఎలా? అనుకుంటూ నడక సాగించాడు బాబు రోడ్డువార కుళాయిలో నీళ్ళు తాగాడు-ఆచల్లనినీళ్లతో ముఖం కడుక్కున్నాడు.

తిరిగి నడక సాగించాడు.

ఎటువెళ్లినా ఒకటేలావుంది బాబుకి.

ఓ చెట్టుకింద చాలా మంది గుమిగూడి వుంటే తను అటునడిచాడు.

ఓ పూసలపిల్ల కోతిని పెట్టుకుని ఆడుకుంటోంది. దానిచేత ఫీట్లు చేయిస్తూంది. అంతా గొల్లున నవ్వుతూ ఆనందిస్తున్నారు.

బాబు కూడా ఆ క్షణం తానెక్కడున్నదీ మరిచిపోయి ఆనందించాడు.

అది డబ్బులు అడగడానికి కంచం పట్టేసరికి అంతా గబగబ వెళ్లిపోయారు. బాబు జేబులు తడుముకుని సిగ్గుపడ్డాడు.

"పోనీలే డబ్బులేకపోతే" అందాపిల్ల.

బాబు మాట్లాడలేదు. అలాగే నిలబడ్డాడు.

అది తనసరంజామా సర్దుకుని కోతిపిల్లని భుజాన ఎక్కించుకుని నడక సాగించింది. దానికి కొంతదూరంలో బాబు నడవడం ప్రారంభించాడు.

"కొంపకి పోక నావెంబెందుకొస్తావు?" అడిగిందాపిల్ల. అదలా అడిగేసరికి ఏడుపు వచ్చేసింది బాబుకి. ఏడుస్తూనే తనెలా వచ్చేసింది చెప్పాడు.

"అయ్యయ్యో, పాడు పట్నంలో ఎలాబతకాలననుకున్నావు? ఈ పూటకి నాతో వుండు. రేపు చూద్దాం" అని అది దానింటికి తీసుకుపోయింది.

* * *

రాజు ఎంతధైర్యం చెపుతున్నా అన్నపూర్ణకి దుఃఖం ఆగడంలేదు. ఎప్పుడో ఎక్కడో తప్పిపోయిన పిల్లల కథలు జ్ఞాపకం తెచ్చుకుని భయంతో ఒణికిపోయింది. సంతానంగారెంతో ధైర్యం చెప్పారు. 'అడపా తడపా మా రాముగాడు పదేసి రోజులు కూడా కన్పించడు' అన్నారు. "ఇప్పుడు చూడండి! వారం అయింది యింటికొచ్చి! వాడే వస్తాడని వూరుకున్నాం!" అన్నారు.

కాని పాపం రాము యింట్లో లేకపోడం ఆయన పెద్ద కూతురు సావిత్రికి కష్టంగావున్న సంగతి ఆయనకేం తెలుసు? తినడాని కేదో ఒకటి ఎలాగో తెచ్చిపడేసేవాడు! వాడు లేక మరీబాధగావుంది-యింట్లో.

* * *

పూసలపిల్ల వెనకనే నడిచి నడిచి ఓ పాడుపడ్డ కొంపచేరాడు బాబు.

అక్కడ వెలుగులేదు. కీచురాళ్లరొద. 'చాలా భయంగావుంది' అన్నాడు.

'ఫరవాలేదు. నిద్రపోతే భయంవుండదని' ధైర్యం చెప్పిందాపిల్ల.

ఎలాగో కళ్లుగట్టిగా మూసుకుని పడుకున్నాడు బాబు. నిద్రసుఖమెరుగదు. అలసిపోయాడేమో ఒళ్ళు తెలియకుండా నిద్రపోయాడు బాబు.

కాని, ఇంటి దగ్గర అన్నపూర్ణకి కంటిమీద కునుకులేదు. బాబుమంచాని కానుకుని కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూనేవుంది.

'నా రాక యింత అనర్థానికి దారితీస్తుందని ఊహించనైనా ఊహించలేదు' అని బాధపడ్డాడు రాజు.

* * *

మధ్యాహ్నం అయ్యేసరికి బాబుకి ఒకటే కడుపునొప్పి. పూసలపిల్ల అంతా నొక్కి చూసింది 'ఆకలికి కాబోలు రొట్టె కొనుకుందామా?' అంటూ చిల్లర లెక్క పెట్టి చూచింది-? డబ్బుల్లేవు. ఎలా? అని ఆలోచనలో పడింది.

దాని కళ్ల గోపాల్ మెడలో గొలుసు పడింది.

"ఇది అమ్మేస్తే చాలా డబ్బువస్తుంది. చాలా రోజులు కడుపునిండా తినొచ్చు" అంది ఆశగా.

"అయితే అమ్మేద్దాం అన్నాడు బాబు.

బజారులో బంగారుదుకాణాల దగ్గర చాలాసేపు తచ్చాడారు యిద్దరూ.

చివరికో కొట్టు కొంచెం ఖాళీగా కన్పించి లోపలికి దూరారు.

దొంగతనంగా అమ్మబోతున్నారు కదా అని చౌకగా కొట్టేద్దామనుకున్నాడు కొట్టువాడు.

పూసలపిల్ల దెబ్బలాటకి దిగింది.

కాని ఏంలాభం? కొట్టువాడు దారిపోయే పోలీసువాణ్ని పిలిచి దాన్ని అప్పగించాడు!

ఆ హడావిడికి భయపడి పరుగు లంకించుకున్నాడు బాబు.

అప్పటికింకా మధ్యాహ్నం కాలేదు.

నడిచి నడిచి ఓ సైకిలుషాపు దగ్గర కాస్త ఆగాడు బాబు. అక్కడో కుర్రాడు సైకిలు తుడుస్తున్నాడు. పక్కపడేసివున్న ఓ బట్టతీసుకుని తనూ తుడవడం ప్రారంభించాడు బాబు.

కొట్టువాడు బాబుని చూసి ఏం 'పనిచేస్తావా'? అని అడిగాడు.

ఏం చెప్పాలో తెలియక తలుపాడు బాబు.

వాడు లోపలి కెళ్లి నాలుగు సైకిలు ట్యూబులు బాబు భుజాల కిటు రెండు అటు రెండు తగిల్చాడు. ఆ బరువుకి 'అబ్బా' అన్నాడు బాబు.

"పక్క వీధిలో కిళ్లీ కొట్టు దగ్గరిచ్చేసిరా. అందాకా యీపావలా, తిరిగివస్తే యింకోపావలా యిస్తా" నంటూ లోపలికి పోయాడు వాడు.

మోస్తూ నెమ్మదిగా పక్కవీధిలోకి మళ్లాడు.

'ఏయ్ అగు' అంటూ సైకిలుమీదపోయే ఓ పోలీసు కేకేశాడు.

ఆ ట్యూబులు అక్కడే పడేసి పరుగెత్తాడు బాబు.

* * *

"వాడ్ని ఏం తెలియకుండా పెంచాను. వాడే సర్వస్వంగా బ్రతికాను. వాడేం కష్టాలుపడుతున్నాడో. అసలు బ్రతికివున్నాడో లేదో" అంటూ ఏడుస్తూంది అన్నపూర్ణ.

పెరుమాళ్లగారు మాటా మంతీ లేకుండా అలా మంచంమీద పడివున్నారు.

సిగరెట్టుమీద సిగరెట్టు కాలుస్తూ ఫోనుదగ్గరే కూర్చుని వున్నాడు రాజు.

అప్పుడే ఫోను మ్రోగింది.

ఇనస్పెక్టరు రావుగారు.

"ఇప్పుడే ఒక వార్త అందింది. ఓ పూసలపిల్లని సిటీపోలీసులు పట్టుకున్నారు, గొలుసొకటి అమ్ముతుంటే. అది కొన్ని విషయాలు చెప్పింది. ఆ మాటలనుపట్టి ఆ గొలుసు మీ కుర్రాడిదేమో. ఆ పిల్లవాడు మీవాడేమోనని అనుమానం. సిటీకి బయలుదేరుతారా," అడిగాడు.

'తక్షణం బయలుదేరుతాం.' అంటూ ఫోను పెట్టేశాడు రాజు.

"ఏమిటి? ఎవరు ఫోను? ఏమైనా తెలిసిందా?" అంటూ పిచ్చిదానిలా భర్త భుజాలు పట్టుకుని కుదిపేసింది అన్నపూర్ణ.

"అవునన్నపూర్ణా. ఇనస్పెక్టరుగారు బాబుగొలుసు దొరికిందట. ఓ పిల్ల దాన్ని అమ్ముతుంటే పట్టుకున్నారట."

యింకా రాజు పూర్తి చెయ్యకుండానే "అయితే బాబుని చంపేసిందా?" భయంగా అరిచింది అన్నపూర్ణ.

"లేదు. వాడు అక్కడే వుండివుంటాడని పోలీసుల అనుమానం. మనం బయలుదేరుదాం." అంటూ రంగన్నని కేకేశాడు రాజు.

"కారు సిద్ధంచెయ్యి. నూకాలూ,ఓ పెట్టెలో అమ్మగారికీ నాకూ బట్టలు సర్దు-ఓ పదినిముషాల్లో మేం బయలుదేరాలి." అన్నాడు.

"మీరు క్షేమంగా వెళ్ళిరండి బాబూ" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు పెరుమాళ్ళుగారు.


"ఫరవాలేదు. నరసింహంగారు చూస్తూవుంటారు మేం త్వరగా వచ్చేస్తాం." అని ధైర్యం చెప్పాడు రాజు.

* * *

బాబు పరుగెత్తి మళ్ళీ ఆ పాడుపడ్డ కొంపకేసి బాణంలాగా దూసుకుపోయాడు. అంతా నిశ్శబ్దంగా వున్నా ఆ కొంప భయంగానే వుంటుంది. అంతా తిరుగుతున్నా భయంగానే వుంటుంది - మాట్లాడేవాళ్ళ మాటలు భూతాల గొంతుకల్లా ప్రతిధ్వనిస్తాయి ఎవరివో గుసగుసలు వినబడ్డంతో బాబు వెన్నులోంచి వణుకు పుట్టింది. ఏడుపొచ్చేస్తోంది. ధైర్యం కూడగట్టుకుని అడుగులో అడుగేస్తూ వెనక్కి నడవడం ప్రారంభించాడు. వెనకనుంచి ఎవరో పట్టుకోడం చూసి ఓ గావుకేక వేశాడు.

* * * *

రాజు వూళ్ళోకి రాగానే ఇనస్పెక్టరు రావు చెప్పిన పోలీసుస్టేషనుకు దారి తీశాడు. గొలుసు చూపించారు. ఆ పూసలపిల్లని కూడా చూపించారు. దాన్ని ప్రశ్నలువేసి వేధించింది అన్నపూర్ణ. దాని వర్ణనపట్టి 'ఆ పిల్లవాడు మన బాబేనండీ' అని కచ్చితంగా చెప్పింది అన్నపూర్ణ.




పూసలపిల్ల చెప్పినట్టు బాబు తప్పకుండా ఆ పాడుకొంపకేసే తలదాచుకుందుకు పరుగెత్తివుంటాడని నమ్మారు పోలీసులు.

అంతా బందోబస్తుతో అటు బయలుదేరారు.

*　　*　　*　　*

"చెప్పు, ఇక్కడెందుకు తిరుగుతున్నావు?" బాబుని పట్టుకున్నవాడు గదమాయించాడు.

"నేనూ పూసలమ్మీ యిక్కడే పడుకుంటాం." అన్నాడు ఒణికిపోతూ బాబు.

"మమ్మల్ని చూశావా ఎప్పుడేనా?"

లేదంటూ తలూపాడు బాబు.

"పదనాతో కూడా, మళ్ళీ నేను పొమ్మనేదాకా పోకూడదు. పోతే తెలుసా?" తల తీసేస్తానని అభినయించాడు రౌడీ.

ఏడుపు దిగమింగి వాడి వెంటపడ్డాడు బాబు.

ఆ చీకట్లో టార్చివెల్గులు, యీలలు వినిపించడంతో బాబు చేయి పట్టుకుని వెనుకవైపు దారితీశాడు రౌడీ. అలికిడి దగ్గిరవుతున్నకొద్దీ భయం పట్టుకుంది రౌడీకి. బాబు జేబులోకి ఓ చిన్న నల్లని పుస్తకం తోస్తూ 'జాగ్రత్త' నేనొచ్చి అడిగేదాకా యెవరికీ యివ్వకు - పరుగెత్తి పో - తిన్నగాపోయి కుడివేపు తిరిగితే - ఎదురే బీచి. గాంధీబొమ్మ వెనకాల పడుకో. నేవస్తా" నంటూ బాబుని తోశాడు.

అమాయికంగా బాబు అటు పరుగెత్తాడు.

ఆ చీకట్లో వాడికి చాలా భయంగా వుంది. రౌడీ చెప్పినట్టు కుడివైపు దారి తిరక్కముందే వచ్చిన యింకోసందులో దూరి తిన్నగా పరుగెత్తాడు. మేరీమాత బొమ్మముందు కదలకుండా వెల్గుతున్నాయి కొవ్వొత్తులు.

బాబువెళ్ళి జేబులో వున్న చిన్న నల్లపుస్తకం మేరీమాత వెనక దాచాడు. హాయిగా ఆమె కాళ్ళముందు నిద్రకొరిగాడు.

*　　*　　*　　*

పాడుకొంప దగ్గిర పోలీసులకి ఎవరూ దొరకలేదు. మళ్ళీ కథ మొదటి కొచ్చిందని అంతా బాధపడ్డారు. బాబు ఎటుపోయినట్టు ? ఆ రౌడీలు ఎక్కడ దాచివుంటారు ? అని అన్నిరకాలుగానూ ఆలోచనలు మళ్ళీ ప్రారంభించారు పోలీసులు.

బాబు దొరికేదాకా యింటికి పోకూడదని నిర్ణయించుకున్నారు రాజు, అన్నపూర్ణ.

ఒక హోటల్‌రూమ్ తీసుకుని వున్నారు.

అన్నపూర్ణకి బెంగతో, అలసటతో బాగా తీవ్రంగా జ్వరం రావడంతో ఆస్పత్రిలో చేర్చాడు రాజు.

"అన్నివిధాలా ఒంటరినయ్యాను" అని బాధపడ్డాడు.

*　　*　　*　　*

కళ్ళు తెరిచేసరికి బాబుమీదికి ఒంగి చూస్తూందొక మదర్.


ఉదయాన్నే మేరీమాతను పువ్వులతో అలంకరించడానికి వచ్చిన మదర్ లిలియన్‌కి ఎక్కడినించో మూల్గు వినిపించింది.

చుట్టూ కలయ చూస్తే- పెద్దపెట్టున జ్వరంతో ఒణికిపోతూ పడుకుని వున్న బాబు కన్పించాడు.

వాడిని తాకి చూసింది మదర్. 'జీసస్. బాగా జ్వరంగా వుందే. ఎవరిపిల్లాడో" అనుకుంటూ వాడిని భుజాన వేసుకుని నన్నరీ చేరింది. డాక్టరుకి కబురంపారు.

"బాబు దడుసుకున్నట్టున్నాడు. వాళ్ల తలితండ్రులకి కబురంపితే మంచిది" అన్నాడు డాక్టర్.

"ఎవరిబిడ్డో, చర్చిలో పడుకునివున్నాడు. వాకబు చేయిస్తాను'' అంది మదర్. అన్నట్టుగానే కమిషనర్‌కి ఫోను చేసింది. ఎవరేనా వచ్చి కలిసేదాకా దయ



చేసి అక్కడే వుంచమనీ, తానే స్వయంగా చూస్తాననీ మదర్‌కి ప్రామిస్ చేశారు కమిషనర్.

*　　　*　　　*

ఆస్పత్రిలో అన్నపూర్ణని చూసి రాజు అప్పుడే రూముకి వచ్చాడు.

'పోలీసుస్టేషను నుంచి ఫోనువచ్చిందనీ, అర్జెంటుగా రమ్మనీ' వార్త వచ్చినట్టు హోటలువారు చెప్పడంతో–స్టేషనుకి పరుగెత్తాడు రాజు.

"ఎనీ న్యూస్?" అంటూ ఇనస్పెక్టర్‌ని ఆత్రంగా అడిగాడు.

"నర్స్‌కి ఒక అబ్బాయి కన్పించాడట. కమిషనర్‌కి ఆ వార్త వారు అందించారు. మీరు వెళ్లి చూస్తారా?" అడిగాడు.

"తప్పకుండాను-ఆలస్యందేనికి? యిప్పుడే వెడతాను." అంటున్న రాజుని వారించి ఫోను తిప్పాడు ఇనస్పెక్టరు.

"మేం ఓసారి బాబుని చూసి వారి పిల్లవాడు ఔనా కాదా? అని చూసు కుంటాం. ఇప్పుడు రావచ్చా?" అని అడిగాడు ఇనస్పెక్టరు.'థ్యాంక్యూ'. అంటూ ఫోను పెట్టేసి బల్లమీది హేటు అందుకున్నాడు.

పోలీసు జీపు కాన్వెంటు గేటులోంచి-దాని వెనకనేవున్న నన్స్ క్వార్టర్లు చేరింది.

రాజుకి చాలా ఆత్రంగావుంది బాబుని ఎప్పుడు చూస్తానా అని.

ఇనస్పెక్టరుని, రాజుని ముందు రిసెప్షన్‌లో కూర్చోపెట్టిందాక సిస్టర్ వచ్చి.

కొద్దిక్షణాల్లోనే మదర్ లిలియన్ వచ్చింది.

"నాతో రండి" అంటూ సిక్‌రూముకేసి దారితీసింది.

జేరవేసివున్న తలుపులు చప్పుడు కాకుండా తెరచింది మదర్ లిలియన్.

తెల్లని దుప్పటి పరచిన మంచం మీద ప్రశాంతంగా నిద్రపోతూ కన్పిం చాడు బాబు.

'బాబూ' అంటూ లోపలికి వెళ్లబోయిన రాజుని 'ష్' అంటూ వారించింది మదర్.

"పడుకోనివ్వండి. మనం మాట్లాడుకుందాం'' అంటూ తిరిగి ముందుగదిలోకి దారి తీసిందామె.

"చూడండి ఇనస్పెక్టరుగారు.ఆ బాబు వీరి బాబేనని తేలిందిగా. మీరిక డ్యూటీకి వెళ్లండి. నేను వీరితో మాట్లాడాలి" అంది మదర్.

"అలాగే మదర్, కాని ఆ కుర్రాడు ఏమాత్రం ఓపిక వచ్చినా పారిపోతాడు జాగ్రత్త" అని హెచ్చరించాడు.

మదర్ నవ్వారు-ఇనస్పెక్టర్ భయానికి." మరేం ఫరవాలేదు. ఇక్కడినుంచి పారిపోకుండా చూసే బాధ్యత నాది మీరుధైర్యంగా వెళ్లండి" అని ఇనస్పెక్టరుని సాగనంపింది.


రాజు చాలా రెస్ట్‌లెస్‌గా ఫీలవుతున్నాడు. బాబు కనిపించాడనీ, జాగ్రత్తగా వున్నాడనీ అన్నపూర్ణకి చెప్పాలని అతని ఆత్రం.

"మీ పేరేమిటి?" మదర్ అడిగింది

ఎక్కడో ఆలోచిస్తున్న రాజు ఉలిక్కిపడి 'రాజు' అన్నాడు.

''చూడండి, మిస్టర్ రాజు,మీ బాబు ఎందుకు పారిపోయివచ్చాడు? కొట్టారా?''

"వాడి తల్లి కొట్టింది మదర్, వాడు చాలా మొండిగా ప్రవర్తించడం సహించలేక కొట్టింది" తలవంచుకుని చెప్పాడు రాజు.



"ఎందుకంత మొండిగా తయారయ్యాడు?" సూటిగా అడిగింది మదర్.

క్షణంసేపు తడబడ్డాడు రాజు.

"మదర్, ఈ ప్రశ్నకి జవాబెలా చెప్పాలో నాకు తెలియదు. నేను వాడి తండ్రినన్న మాటేగాని వాడు పుట్టాక తొలిసారిప్పుడే చూశాను."

మదర్ ఆశ్చర్యంతో కను బొమ్మలు పైకెత్తి రాజుకేసి చూసింది.

"అవును మదర్" అంటూ నెమ్మదిగా రాజు తమ కథ అంతా చెప్పాడు. "వెళ్ళిపోయానన్న మాటేగాని, ఎంత త్వరగా వస్తానా అన్న ఆత్రం నాలో పెరిగి సెలవంతా ఏకంగా చివరికి ప్రోగుచేసి అనుకున్నదానికంటే ముందుగానే వచ్చాను. కాని ఏం లాభం? నా ఆశ నిరాశ అయింది. అన్నపూర్ణ నన్ను ఎంత ఆప్యాయంగా ఆనందంగా ఆహ్వానించిందో బాబు అంత అసహ్యించుకున్నాడు నా రాకకి..." నిట్టూర్చాడు రాజు.

మదర్ కూడా ఓ నిమిషంపాటు మాట్లాడలేదు.

"మిస్టర్ రాజు, ప్రపంచంలో తల్లి తండ్రులు రకరకాలుగా వుంటారు.

కొందరు అతి అభిమానంతో పిల్లలని దూరం చేసుకుంటారు. కొందరతి కాఠి న్యంతో దూరంచేసుకుంటారు. మీవాడిలా కాడానికి నీ తప్పుకాదు, నీ భార్య తప్పు. నేను మీవాడితో మాట్లాడుతాను. నీ భార్యని రేపు తీసుకురా" అంటూ లేచి నిలచింది మదర్.

చేతులు జోడించి నమస్కరించాడు రాజు

తన మనస్సులోని బాధనంతా వెళ్లకక్కుకున్నాక తేలికగా వుందతనికి.

* * *

హొటల్ రూమ్‌కి రాగానే యింటికి ట్రంకాల్ బుక్ చేసాడు... అది వచ్చే దాకా విశ్రాంతిగా గదిలో కూర్చున్నాడు.

అతని మనస్సు పరిపరి విధాల పోయింది. ఎంతో ఆశతో కనిపించిన పిల్లలిలా అయితే ఎవరేం చేయకలరు? ఈ తప్పు ఎవరిది? వీరిలో ఎవరు మారాలి? ప్రశ్నలు పరంపరగా సుళ్ళు తిరుగుతున్నాయి, అతని మనస్సులో.

కాల్ వచ్చింది, సంతానంగారు తీశారు. సంతానంగారికి విశేషాలన్నీ చెప్పి మామగారిని కంగారుపడద్దనీ ఒకటి రెండు రోజుల్లో వచ్చేస్తున్నామని చెప్పమనీ చెప్పాడు.

ఆస్పత్రికి బయలుదేరాడు రాజు.

"బాబు దొరికాడా?" అంటూ రూములోకి యింకా పూర్తిగా అడుగుపెట్ట కుండానే అడిగింది అన్నపూర్ణ.

"దొరికాడు పూర్ణా, బాగున్నాడు- నువ్వేం కంగారుపడకు" అంటూ మంచం అంచున కూర్చుని ఆమె చేయి తన చేతిలోకి తీసుకున్నాడు.


"చెప్పండి, ఎక్కడున్నాడు? మీరెందుకు తీసుకురాలేదు? మిమ్మల్ని చూసి పారిపోయాడా?" ఆత్రంగా అడుగుతున్న అన్నపూర్ణ చెయ్యి గట్టిగా నొక్కాడు రాజు. బాబు ఎక్కడున్నదీ చెప్పాడు రాజు.

"అమ్మయ్య! మనం యింక యింటికి వెళ్లచ్చు" అంది అన్నపూర్ణ.

"మదర్, నీతో మాట్లాడుతానన్నారు. డాక్టరుని అడిగి రేపు తీసుకు వెడతాను."

"నాకింకేం రోగంలేదండి, యిప్పుడే వెడదాం," అంది అన్నపూర్ణ.

"ముందు డాక్టరు నడిగి రూముకి తీసుకువెడతాను. రేపే రమ్మంది మదర్."




డాక్టరు అన్నపూర్ణని తీసుకువెళ్లడానికి పర్మిషన్ యిచ్చాడు.

కారెక్కి కూర్చున్న అన్నపూర్ణని చూసి రంగన్నకూడా కంటతడిపెట్టాడు. "రెండు పూటల్లో ఎంత చిక్కిపోయారమ్మా" అంటూ.

"బాబుని చూస్తే యిట్టే బాగుపడిపోతాను రంగన్నా" అంది ఉత్సాహంగా.

అందరూ కొత్త వుత్సాహం పుంజుకున్నారు.

* * * *

"బాబూ ఎలావుంది?" అడిగింది మదర్ కళ్లు తెరుస్తున్న బాబుని చూసి.

"బాగుంది. నేను అమ్మదగ్గరికి పోతాను" అన్నాడు లేచి కూర్చుంటూ.

"అలాగే కాని అమ్మ ఎక్కడ?"

"ఏం ఏమైంది, అమ్మకి? నాన్న కొట్టారా?" అడిగాడు.

"నాన్నగా రెందుకు కొడతారు?"

"నాన్నలంతే. నాన్న వచ్చిన దగ్గిరనుంచీ నన్ను అమ్మ చూడ్డం మానేసింది." కోపంగా అన్నాడు బాబు.

"ఎందుకు మానేసింది? నువ్వు అల్లరి చేశావా?"

"లేదు. నాన్న. నాన్న. నాన్న. అందరూ నాన్న కోసం. నన్నెవరూ చూడరు" ఏడుపు స్వరంతో అన్నాడు బాబు.

ప్రేమగా వాడి తల నిమిరింది మదర్.

"చూడు నాయనా, అమ్మలకి ఎన్నో పనులుంటాయి. యిన్నాళ్లూ నాన్నగారు ఊళ్ళోలేరు. అంచేత అన్నీ నీపనులే ఉండేవి అమ్మకి ! మరి నాన్నగారొచ్చాక వారి పని చూడవద్దా ? చెప్పు. అయినా తండ్రి దేవుడితో సమానం. నీకోసం ప్రాణం పెట్టకలడు. నీకు బాధ కల్గితే తనకు తగిలినట్టు బాధపడకలడు. ఇప్పుడు చూడు. నువ్విలా పారిపోయివచ్చినందువల్ల ఎక్కువ బాధపడిందెవరు ? మీ నాన్నే. మీ అమ్మ మంచం పట్టింది. ఆమెను రక్షించుకున్న దెవరు ? మీ నాన్న. నీవు ఎక్కడున్నదీ వెతికి సాధించినది ఎవరు? మీ నాన్న. మీ నాన్న పూనుకోకపోతే నువ్విక మళ్లీ అమ్మని చూడకల్గేవాడివా ? యిల్లు చేరకల్గేవాడివా ? చెప్పు?" ప్రశాంతంగా అడిగింది.

బాబుకి అంతా అయోమయంగా వుంది.

"మా నాన్నెందుకు నాకోసం కష్టపడతాడు ? అమ్మకే నేనంటే యిష్టం" అన్నాడు.

"అక్కడే పొరబడుతున్నావు. నిన్ను చూడగానే మీ నాన్నకి నువ్వంటే ఎంత యిష్టమో – తెలుస్తుంది కదా !"

"మరెలా ?" అమాయకంగా అడిగాడు బాబు

"మరేం ఫరవాలేదు. నాన్నగారి మనసు వెన్నపూసలాంటిది. నువ్వు ప్రేమగా నాన్నా అని పిలిచినా చాలు కరిగిపోతుంది. పిలుస్తావా ? మీ నాన్నతో స్నేహం కడతావా ?"

"కొడితే ?"

"ఎందుకు కొడతారు ? నువ్వింత అల్లరిచేస్తే కొట్టారా ? బాధపడ్డారు కాని!" అంది మదర్.

"ఫరవాలేదా ?"

"ఏం భయంలేదు. నువ్వే చూస్తావుగా రేపు !" అంటూ దుప్పటి కప్పి పడుకోమని చెప్పి వెళ్లింది మదర్.

* * * *

మరునాడు ఎప్పుడు తెల్లవారుతుందా అన్న ఆత్రంతో నిద్రకూడాపోలేదు అన్నపూర్ణ. ఉదయాన్నే కాన్వెంటులోకి దారితీశారు. రిసెప్షన్ రూములో కూర్చున్నారు అన్నపూర్ణ, రాజూ. మదర్ వచ్చింది.

"మిస్టర్ రాజూ, మీరు లోపలికి వెళ్లి బాబుతో మాట్లాడండి. నేను మీ శ్రీమతితో మాట్లాడతాను" అంది.




ఆత్రంగా లేచింది అన్నపూర్ణ - "నే చూస్తాను బాబుని ముందట" అంటూ. మదర్ వారించింది.

రాజు బాబున్న గదిలోకి నడిచాడు.

తండ్రిని చూసి బావురుమని ఏడుస్తూనే చేతులు జాచాడు బాబు.

ఎదురుచూడని యీ పరిణామానికి రాజు హృదయం పులకరించింది. "బాబూ" అంటూ కొడుకుని గట్టిగా గుండెలకి హత్తుకున్నాడు.

బల్లిలా తండ్రిని కరుచుకుపోయి ఏడ్చాడు బాబు.

ఆ ఏడుపే వాడి పశ్చాత్తాపం.

ఆ ఏడుపు వాడి మొండితనాన్ని కడిగేసింది.

ఆ ఏడుపుతో తండ్రీకొడుకులు ఏకం అయ్యారు.

*   *   *   *

"చూడండి, తల్లిగా మీ బాధ్యత మరచిపోతే వచ్చే చిక్కు చూశారా?"

"నేనేం మరిచిపోయాను మదర్. వాడిని పువ్వుల్లో పెట్టి పెంచాను. కాని..." గద్గదం అయిపోయింది అన్నపూర్ణ కంఠస్వరం.

అన్నపూర్ణ చెయ్యి నెమ్మదిగా తట్టింది మదర్ ఓదార్పుగా.

"అలా పిల్లల్ని పువ్వుల్లోపెట్టి పెంచడమే- నువ్వుచేసిన తప్పు. నీ భర్త చెంత లేడుకదా అని నీ అభిమానం, ప్రేమ, వాత్సల్యం - వాడిమీద ముంచెత్తావు. తీరా నీ భర్త వచ్చేసరికి వాడికి దూరం కాసాగావు. అది వాడి చిన్న మనస్సుకి ఎలా తెలుస్తుంది? తండ్రి రాకకోసం నీలాగే వాడినీ సిద్ధంచేసి వుండాలి నువ్వు. నువ్వే సర్వస్వం అనుకుని వాడు తండ్రిని పైవాడనుకొన్నాడు. వాడి తప్పేముంది?'' సూటిగా అడిగింది. అన్నపూర్ణ - దీనికి బదులేం చెప్తుంది? మౌనంగా వూరుకుంది. ''నువ్వు అదృష్టవంతురాలివి కనుక దారితప్పిన నీ బిడ్డ మళ్ళీ నీకు దక్కాడు. ఇప్పుడేనా నీ బిడ్డా - నీ భర్తా ఇద్దరూ రెండు కళ్ళు అనుకో. ఏ ఒక్క కంటికీ విడిగా ప్రత్యేకత లేదు. రెండూ బాగుంటేనే నీకు ఆనందం. లోపలికి వెళ్ళు-'' అంటూ లేచి దారితీసింది మదర్.

కాళ్ళు తడబడుతూంటే నెమ్మదిగా సిల్కు కర్టెను తొలగించింది అన్నపూర్ణ.

తండ్రి ఒళ్లో కూర్చుని ఆనందంగా కనిపించిన బాబుని చూసి కంటనీరు నిండింది అన్నపూర్ణకి.

'బాబూ' అంటూ చేతులు చాచింది.

'అమ్మా' అంటూ తండ్రి వడిలోంచి లేచి అమ్మ కంఠం గట్టిగా కౌగలించుకున్నాడు.

వాడికిక ఏడుపు రాలేదు.

"ఇంటికి వెళ్లిపోదాం రండి నాన్నగారూ," అని తండ్రిని ఆహ్వానించాడు.

"ఈవాళే వెళ్లిపోదాం బాబూ,"అంటూ కొడుకు చేయి అందుకున్నాడు.

మదర్‌కి కృతజ్ఞత చెప్పి కారెక్కారు.

"చినబాబూ ఎంత హడావిడి పెట్టావయ్యా" అంటూ కళ్లు వత్తుకుని కారు స్టార్టుచేశాడు రంగన్న.

* * * *

ఇంకో క్షణంకూడా ఆ వూళ్లో ఉండబుద్ధి కాలేదు అన్నపూర్ణకి.

అప్పుడే హొటలు రూము కూడా ఖాళీచేసి వూరికి బయలుదేరారు.

ఈ తిరుగు ప్రయాణం ఎంతో ఉత్సాహంగావుందా-మారిన మనసులకి.

